# తొలివార్త

RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
తెలుగు దిన పత్రిక
www.epaper.tolivaartha.com

ప్రచురణ : రంగారెడ్డి   ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్   సంపుటి : 02   సంచిక : 156   ఆదివారం   11 - 10 - 2026   వెల : 4/-   పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial



best deal
HEALTH & WEALTH
"అవకాశాలను సృష్టించడం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం."
We create opportunities | 9640707117 (What's up only)


# విద్యుత్ సమస్య ఉంది
# పొదుపుగా వాడుకోండి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఎల్‌నినో పరిస్థితులపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు
- ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.
- ఎల్‌నినో పరిస్థితులపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 10 :** విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులపై సీఎస్, సీఎంవో ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమీక్షలో నరేందర్‌రెడ్డి, రామకృష్ణారావు, సీఎస్ సంజయ్ జాజు, డీజీపీ ఆనంద్ పాల్గొన్నారు.ఎల్‌నినో వల్ల భవిష్యత్‌లో తీవ్ర సంక్షోభం ఎదుర్కోవాల్సి ఉందని, వచ్చే జూన్ వరకు సాగు, తాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యలపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మార్కెట్‌లో విద్యుత్ - మిగతా 2 లో

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు



- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి
- ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని వెల్లడి

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 10 :** తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ - మిగతా 2 లో



## తెలంగాణలో ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు
- ఎంగిలి పూల బతుకమ్మతో మొదలైన తొమ్మిది రోజుల ఉత్సవాలు
- సంప్రదాయ వస్త్రాల్లో మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు
- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాట్లు

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 10 :** తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ఉత్సవాలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా - మిగతా 2 లో

## రిగ్గింగ్ ఆధారాలుంటే చూపండి

- ఈసీకి మద్దతుగా మాజీ ఉన్నతాధికారుల ఘాటు లేఖ
- ఎన్నికల సంఘానికి మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు
- రిగ్గింగ్ ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని స్పష్టీకరణ
- గతంలో బూత్ కబ్జాలు చూశాం, నేటి వ్యవస్థ పటిష్టంగా ఉందని వెల్లడి
- నిరాధార ఆరోపణలతో ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరచవద్దని హితవు




**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 10 :** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ), ఎన్నికల ప్రక్రియలపై ప్రతిపక్షాలు చేస్తున్న 'రిగ్గింగ్' ఆరోపణలపై 124 మంది విశ్రాంత ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సంఘాన్ని సమర్థిస్తూ, భారత పౌరులను ఉద్దేశించి వారు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల అక్రమాలపై చేసే ఆరోపణలకు కచ్చితమైన ఆధారాలు ఉండాలని, నిరాధార ఆరోపణలతో ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయవద్దని హితవు పలికారు.'ఓట్ల చోరీ' జరుగుతోందంటూ ప్రతిపక్షాలు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న తరుణంలో ఈ లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో శనివారం జరిగిన ఆందోళనల్లో పాల్గొనేందుకు ప్రయత్నించిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో మాజీ అధికారులు స్పందిస్తూ, "మేం ఏ రాజకీయ పార్టీకి చెందినవాళ్లం కాదు. దశాబ్దాల పాటు మా సర్వీసులో ఎన్నికల నిర్వహణను దగ్గరుండి చూశాం. ఓటర్ల జాబితా రూపకల్పన నుంచి ఈవీఎంలను - మిగతా 2 లో

# ఢిల్లీ
# అష్ట దిగ్బంధనం




- జంతర్ మంతర్ నిరసనలకు 'అజింక్య' నాయకత్వం
- ఆకాశవాణి భవన్ వద్ద రాళ్ల దాడి
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ తలపెట్టిన నిరసనలకు ఇకపై అజింక్య శిందే నాయకత్వం వహిస్తారని అభిజీత్ దీప్కే ప్రకటించారు
- తాము నిర్బంధంలో ఉన్నంత కాలం ఆయనే దీనికి నాయక్వం వహిస్తారని స్పష్టం చేశారు

## వర్షాభావ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం
- ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులున్నా నేపథ్యంలో వ్యవసాయం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ సీఎస్ సాయిప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు



**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 10 :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, రాష్ట్రంలో వ్యవసాయం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను - మిగతా 2 లో

## ఆఫ్రికా చెల్లింపుల వ్యవస్థలో యూపీఐ

- భారత్‌తో జింబాబ్వే చర్చలు
- ఆఫ్రికా చెల్లింపుల వ్యవస్థను మార్చేందుకు జింబాబ్వే ప్రయత్నాలు
- భారత యూపీఐ టెక్నాలజీ కోసం ఎన్‌పీసీఐతో చర్చలు
- తక్కువ ఖర్చుతో వేగవంతమైన లావాదేవీలే ప్రధాన లక్ష్యం
- అక్టోబర్ 31 నాటికి ఒప్పందం ఖరారయ్యే అవకాశం
- ఇప్పటికే పలు ఆఫ్రికా దేశాలు యూపీఐపై ఆసక్తి - మిగతా 2 లో

## సీఎం చంద్రబాబుకు కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు



- పట్టిసీమ ద్వారా నీరందించిన సీఎం చంద్రబాబును కలిసిన కృష్ణా డెల్టా రైతులు
- చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్' అంటూ శాలువాతో సత్కరించిన రైతులు
- పట్టిసీమతో 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి నీటిని కృష్ణాకు తరలించామన్న సీఎం

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 10 :** పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు జల భరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు హృదయపూర్వక - మిగతా 2 లో



## ప్రతిపక్షాల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి

- 13 కోట్ల ఓట్ల తొలగింపు ఆరోపణలు అవాస్తవమన్న వెంకయ్యనాయుడు
- ఓడిపోతే ఈవీఎంలను నిందించడం హాస్యాస్పదమని వ్యాఖ్య
- ప్రతిపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని విమర్శ

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 10 :** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలపై మాజీ ఉపరాష్ట్రపతి - మిగతా 2 లో

# నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి

- అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులదే
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- స్థానిక ఎన్నికలకు ముఖ్యమంత్రి చంద్రబాబు డెడ్‌లైన్ ఫిక్స్ చేశారు
- గెలుపు టార్గెట్ 100 శాతంగా నిర్ణయించారు
- నవంబర్15 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి, పాలనపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు
- కేబినెట్ భేటీ ముగిశాక సహచర మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చలు



**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 10 :** స్థానిక ఎన్నికలకు ముఖ్యమంత్రి చంద్రబాబు డెడ్‌లైన్ ఫిక్స్ చేశారు. గెలుపు టార్గెట్ 100 శాతంగా నిర్ణయించారు. నవంబర్ 15 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి, పాలనపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. బీసీ రిజర్వేషన్ల నుంచి కూటమి పార్టీల సమన్వయం వరకు ఎన్నికల వ్యూహంపై కీలక సూచనలు చేశారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొంటూనే నియోజకవర్గాల అభివృద్ధికి నిధుల విడుదలపైనా కీలక ప్రకటన చేశారు.కేబినెట్ భేటీ ముగిశాక సహచర మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చలు జరిపారు. స్థానిక సంస్థల ఎన్నికలే అజెండాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సన్నద్ధత, బీసీ రిజర్వేషన్లు, రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను మంత్రులు, ఎమ్మెల్యేలు సీరియస్‌గా తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలని సూచించారు. ఈ ఎన్నికల ద్వారా కొత్త నాయకత్వం తెరపైకి వస్తుందని స్పష్టం చేశారు. - మిగతా 2 లో

తొలివార్త

ఆదివారం 11 - 10 - 2026

# సంపాదకీయం

## గాజా గుర్తుందా?



ఇరాన్‌తో అమెరికా చేస్తున్న యుద్ధం, ఏర్పడిన సంక్షోభాలతో ప్రపంచం గాజా బాధను పూర్తిగా గాలికి వదిలేసింది. గాజాను ఉద్ధరిస్తామంటూ పలు దేశాలు చేసిన వాగ్దానాలు మాటలకే పరిమితమైనాయి. మూడేళ్ళక్రితం అక్టోబర్ 7న హమాస్ జరిపిన నరమేధంలో 1,200 మంది ఇజ్రాయెల్ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఓ 250 మందిని బందీలుగా తీసుకుపోయారు. దీనికి ప్రతీకారంగా, గాజాలో ఇజ్రాయెల్ రెండేళ్ళపాటు అతిభయానకమైన యుద్ధాన్ని కొనసాగించింది. ఐక్యరాజ్యసమితి విచారణ కమిషన్ సహా చాలా సంస్థలు దీనిని నరమేధం అన్నాయి. 75వేలకు పైగా పాలస్తీనియన్లు మరణించారు, నేలమట్టమైన ఆ గాజా శిథిలాల కింద ఇంకా అనేకవేలమంది పూడుకుపోయారు. నేటికి ఏడాది క్రితం అమెరికా ఒత్తిడిమేరకు కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తరువాత కూడా ఓ పద్నాలుగు వందలమంది గాజా ప్రజలు ఇజ్రాయెల్ హింసతో కన్నుమూశారు. ఐడీఎఫ్ ఆధ్వర్యంలో భారీ ఊచకోతలు ఆపి, చిన్నాచితకాదాడుతో ఇజ్రాయెల్ తన దమనకాండను కొనసాగిస్తూనే ఉంది. ఆహారం, మందులు ఇత్యాది సరఫరాలమీద ఇజ్రాయెల్ ఆంక్షలతో మిగిలిన గాజావాసులు ప్రత్యక్షనరకం అనుభవిస్తున్నారు. గాజా పునర్నిర్మాణం ఊసే ప్రపంచం మరిచిపోయింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెచ్చిన 20 -అంశాల శాంతి ప్రణాళిక తొలిదశలో భాగంగా 2,000 మంది పాలస్తీనా ఖైదీల విడుదలకు బదులుగా, హమాస్ దగ్గర ప్రాణాలతో మిగిలివున్న ఇజ్రాయెలీ బందీలు ఇళ్లకు చేరుకున్నారు, ఇళ్ళు కోల్పోయిన లక్షలాదిమంది గాజావాసులు ఉత్తరదిక్కుకు తరలివెళ్లారు. అమెరికా అధ్యక్షతన అనేక దేశాలతో కూడిన శాంతి మండలితో పాటు, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి కూడా ఈ ప్రణాళికను ఆమోదించిన విషయం తెలిసిందే. అయితే, మిగతా ప్రపంచం నుంచి ఒత్తిడిలేకపోవడంతో, ట్రంప్ ప్రణాళిక రెండోదశ నత్తనడకన సాగుతోంది. గాజాలో భద్రతను పర్యవేక్షించాల్సిన దళాలు కానీ, దానిని పాలించాల్సిన సాంకేతిక నిపుణుల కమిటీ కానీ ఇంకా పూర్తిస్థాయిలో రంగంలోకి దిగలేదు. ఆయుధాలు వదిలేయడానికి హమాస్ సిద్ధంగా లేదు కనుక, అది పూర్తిగా అస్త్రసన్యాసం చేస్తే తప్ప పునర్నిర్మాణానికి ఇజ్రాయెల్ ఒప్పుకోవడం లేదు. దీంతో ఆ పనులు ఆరంభించే ప్రయత్నం కూడా బలంగా సాగడం లేదు. ఈ నెలాఖరులో ఎన్నికలు జరగబోతున్నందున నెతన్యాహూ శాంతి ప్రక్రియకు మోకాలడ్డుతూనే ఉన్నారు. గాజాతో ఎంత నిర్దయగా వ్యవహరిస్తే ఓటర్లు తమను అంతగా ఆదరిస్తారని నెతన్యాహూ నేతృత్వంలోని మితవాద కూటమి నమ్మకం. ఉక్రెయిన్, ఇరాన్, లెబనాన్ యుద్ధాలు, అవి తెచ్చిన ఆహార, ఇంధన సంక్షోభాలు ముఖ్యమైపోయి, గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న హింస, వెస్ట్‌బ్యాంకులో అది ఉధృతంగా సాగిస్తున్న దురాక్రమణలు ప్రపంచానికి పట్టడం లేదు. పాలస్తీనియన్లపై యూదుసెటిలర్ల దాడులు కూడా రికార్డుస్థాయిని దాటిపోయాయి. అక్టోబర్ 27న జరగబోయే పార్లమెంటరీ ఎన్నికల్లో తిమ్మినిబమ్మిని చేసైనా నెగ్గుకురావడానికి నెతన్యాహూ ప్రయత్నిస్తున్నారు. ఆయనకు విజయావకాశాలు తక్కువని అనేక సర్వేలు నిర్ధారించిన తరుణంలోనే, షైదుబాయ్ ఘటన జరిగింది. ప్రజలను నిత్యం భద్రతాభయంలో ముంచెత్తుతూ వారి ఏకైక రక్షకుడుగా తానే కనిపించాలన్న నెతన్యాహూ విధానానికి ఇది మరింత ఉపకరిస్తుంది. మహామతోన్మాది అన్న భయంతో ఒమాన్ నిషేధించిన వ్యక్తి, ఇజ్రాయెల్‌కు పోతున్న ఈ విమానంలోకి కో పైలట్‌గా ఎలా వచ్చికూర్చోగలిగాడన్న అనుమానం మిగతా ప్రపంచానికి అలాగే ఉండిపోయింది. ఈ ఘటన వెనుక ఏదో రాజకీయకుట్ర ఉన్నదన్న భావనతో కొన్ని మీడియా కథనాలు కూడా వెలువడ్డాయి. నిజానిజాలు అటుంచితే, ప్రజలను కాపాడలేని అసమర్ధతను సైతం తనకు అనుకూలంగా మార్చుకోగల సమర్థుడు నెతన్యాహూ. హమాస్‌దాడిని వాడుకున్నట్టే, షైదుబాయ్ ఘటనను కూడా ఆయన తన ఓటుబ్యాంకును సుస్థిరం చేసుకోవడానికి అనుగుణంగా మలుచుకుంటున్నారు. ఇజ్రాయెల్‌లో ప్రభుత్వం మారితేనే, గాజా పరిస్థితిలో కాస్తంత మార్పు మొదలుకావచ్చు.

# నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి



**మొదటిపేజీ తరువాయి -** కూటమిలోని మూడు పార్టీల మధ్య సమన్వయమే ఎన్నికల్లో కీలకమని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మంత్రులు పరస్పరం సంప్రదింపులు జరుపుతూ ముందుకు వెళ్లాలని సూచించారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని తేల్చిచెప్పారు. ఏ ఒక్క స్థానాన్ని కోల్పోవడానికి వీల్లేదని, అన్ని స్థానాల్లోనూ విజయం సాధించేలా సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికలోని వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా వైఎస్సార్సీపీ అడ్డంకులు సృష్టిస్తోందని చంద్రబాబు విమర్శించారు. గతంలో బీసీలకు అమలైన 34 శాతం రిజర్వేషన్లను జగన్ ప్రభుత్వం తగ్గించిందని, హైకోర్టు కొట్టివేసిన జీవోలపై సుప్రీంకోర్టును ఆశ్రయించలేదని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్ల కోసం ప్రయత్నిస్తుంటే వైఎస్సార్సీపీ కోర్టును ఆశ్రయించిందని ఆక్షేపించారు. వైఎస్సార్సీపీ న్యాయస్థానాన్ని ఆశ్రయించకుండా ఉంటే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవని వ్యాఖ్యానించారు. బీసీలకు పార్టీల పరంగా సాధ్యమైనంత ఎక్కువ రిజర్వేషన్లు కల్పించాలని చంద్రబాబు సూచించారు. ఎస్ఐఆర్ తర్వాత వెలువడే ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహించాలని జగన్ కోర్టును ఆశ్రయించడంపై సీఎం విమర్శలు చేశారు. ఓటమి భయంతోనే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా పరిషత్‌ల సంఖ్య పెరిగినందున జడ్పీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు కొత్త రోస్టర్ రూపొందించాల్సిన అవసరం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎల్‌నినో పరిస్థితులపై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం ఉన్నప్పటికీ గత ఏడాది నీటిని నిల్వ చేసుకోవడం వల్ల ఈ ఏడాది కొంతవరకు ఇబ్బందుల నుంచి బయటపడగలిగామని వివరించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. పాలనలో మంత్రులు మరింత చురుగ్గా వ్యవహరించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రేక్షకుల్లా ఉండిపోకుండా కొత్త విషయాలు నేర్చుకుంటూ పాలనా వ్యవహారాలపై పట్టు పెంచుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత శాఖల మంత్రులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని సాధించాలని ఆదేశించారు. కేంద్రంతో సమన్వయం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన వనరులను సమీకరించుకోవాలని దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద ఒక్కో నియోజకవర్గానికి కోటి రూపాయల చొప్పున నిధులు విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. సోమ, మంగళవారాల్లో ఈ నిధులను విడుదల చేస్తామని తెలిపారు. దీంతో స్థానికంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులోకి రానున్నాయి.

# వర్షాభావ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి



**మొదటిపేజీ తరువాయి -** ఆదేశించారు. రానున్న ఆరు నెలల పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, తాగునీటి చోరీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో వ్యవసాయం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కలెక్టర్లను ఆదేశించారు. సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సూచించారు. మంచి నీటిని కేవలం తాగేందుకు మాత్రమే ఉపయోగించాలని, ఇతర అవసరాలకు గానీ, చేపలు, రొయ్యల చెరువులకు గానీ మళ్లించకుండా కఠిన నిఘా ఉంచాలని సీఎస్ ఆదేశించారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే తక్షణమే వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రానున్న ఆరు నెలల కాలం అత్యంత కీలకమైనదని, తాగునీటి సరఫరాపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శులు ప్రస్తుత తాగునీటి పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించామని, ఆయా చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు సీఎస్ వివరించారు. తాగునీటితో పాటు రాష్ట్రంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను సీఎస్ సమీక్షించారు. రీసర్వే వివిధ దశల్లో ఉందని, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త పథకాల కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు త్వరగా ఇళ్లు అందేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న 'సంజీవని' ఆరోగ్య సేవల పరిధిని విస్తరించడానికి అన్ని జిల్లాలు సన్నద్ధం కావాలని సీఎస్ పిలుపునిచ్చారు. ఈ వైద్య సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మందులు, సిబ్బందిని ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను, కలెక్టర్లను ఆదేశించారు.

# ఢిల్లీ అష్ట దిగ్బంధనం

**మొదటిపేజీ తరువాయి -** జంతర్ మంతర్ 2.0 నిరసనలకు ఇకపై అజింక్య శిందే నాయకత్వం వహిస్తారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం ప్రకటించారు. తాము పోలీసుల నిర్బంధంలో ఉన్నంత కాలం కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగే నిరసనలు, సీజేపీ ఇన్‌ఛార్జ్ అజింక్య శిందే నాయకత్వంలోనే జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. "నన్ను అరెస్టు చేస్తారని ముందే ఊహించాను. అందుకే శుక్రవారం రాత్రి అజింక్య శిందే ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తాడని స్వయంగా చెబుతూ ఓ వీడియో రికార్డు చేశాను. అందుకే ఈ వీడియో చూస్తున్న వాళ్లు అజింక్య శిందేను అనుసరించాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను" అని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా శనివారం తెలిపారు. ముంబయి నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్‌కు వెళ్తున్న అభిజీత్ దీప్కేను శనివారం విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా పోలీసుల అదుపులోనే ఉన్నారు. వీరిని విమానాశ్రయం నుంచి నేరుగా ఓ అజ్ఞాత ప్రాంతానికి తరలించారు. సీజేపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజేపీ తలపెట్టిన నిరసనలను అణిచివేసేందుకు మోదీ ప్రభుత్వం 'ఎమర్జెన్సీ కన్నా దారుణమైన నిర్బంధం' పెడుతోందని విమర్శించారు. బొద్దింకలను చూసి ప్రధాని మోదీ భయపడుతున్నారని అన్నారు. "ఇది ఎమర్జెన్సీ కన్నా దారుణం. మనం మోదీ సంపూర్ణ నియంతృత్వంలో బతుకుతున్నాం. విమానం దిగిన వెంటనే బొద్దింకలను అరెస్టు చేయడం, ప్రధాని మోదీకి ఉన్న భయాన్ని చూపిస్తుంది. కేవలం ఓటు చోరీ ద్వారా ఎన్నికల్లో గెలిచామని మోదీకి తెలుసు. ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అణచివేసి తన మోసాన్ని కాపాడుకోవడానికి కంకణం కట్టుకున్నారు. ఏదైమైనా సీఈసీ జ్ఞానేశ్ వెళ్లాలి. అలాగే మోదీ కూడా" అని కేజ్రీవాల్ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. శనివారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో సీజేపీకి మద్దతుగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న న్యాయవాదులను పోలీసులు నిర్బంధించడంపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా స్పందించింది. పోలీసులు మితిమీరిన బలప్రయోగం చేశారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరింది. ప్రస్తుతం నిర్బంధంలో ఉన్న న్యాయవాదుల ఆచూకీ, భద్రత నిర్ధరించడం కోసం, వారికి న్యాయ సహాయం అందేలా చూడాలని, ఇందుకోసం సంబంధిత అధికారులతో చర్చించాలని ఎస్‌సీబీఏ గౌరవ కార్యదర్శి ప్రజ్ఞా బఘేల్ సీజేఐను కోరారు. నిర్బంధానికి చట్టబద్ధమైన కారణాలు లేని వారిని తక్షణమే విడుదల చేయాలని, ఒకవేళ పోలీసులు బలప్రయోగం చేస్తే, చట్టప్రకారం తగు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఢిల్లీలోని ఆకాశవాణి భవన్ సమీపంలో 25-30 మంది నిరసనకారులు ఇంతియాజ్ అలీ మార్గ్‌లోని బారికేడ్లపై నుంచి దూకి భద్రతా సిబ్బందిపై రాళ్లతో దాడి చేశారని పోలీసులు తెలిపారు. రాళ్లదాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారని, తాము కొందరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వాస్తవానికి జంతర్ మంతర్ వద్ద సీజేపీ తలపెట్టిన నిరసనలకు పోలీసులు అనుమతి నిరాకరించారు. అంతేకాకుండా కఠినమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా 500 మందిని అదుపులోకి తీసుకున్నారు. అయినప్పటికీ పలువురు నిరసనకారులు వేర్వేరు ప్రదేశాల నుంచి జంతర్ మంతర్‌కు వచ్చే ప్రయత్నం చేశారు. దీనితో పోలీసులు పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకోగా, మరికొందరిని వెనక్కు పంపించారు. కాగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రస్తుత పరిస్థితులన్నింటినీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

## సీఎం చంద్రబాబుకు కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు

**మొదటిపేజీ తరువాయి -** కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి సీఎంను కలిసిన రైతులు.. ఆయనను శాలువాతో సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్'గా, 'జలప్రదాత'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పట్టిసీమ ద్వారా గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు తరలించి, అదే సమయంలో శ్రీశైలంలో పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు అందించి అన్ని ప్రాంతాలకు న్యాయం చేశారని కొనియాడారు. కేవలం చంద్రబాబు ముందుచూపుతోనే ఇది సాధ్యమైందని, ఆయన కృషితోనే కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందని అన్నారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు సుమారు 500 టీఎంసీల నీటిని తమ ప్రాంతానికి అందించడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. రైతుల అభినందనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, వారికి ధన్యవాదాలు తెలిపారు. పట్టిసీమ ద్వారా వచ్చిన నీటితో కృష్ణా డెల్టాలో సిరులు పండించిన రైతుల కృషిని ఆయన అభినందించారు. "పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గత 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి వరద నీటిని కృష్ణా బేసిన్‌కు విజయవంతంగా తరలించాం. ఈ ప్రాజెక్టుతో సాధించిన జలవిజయం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ ఆలోచన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం డెల్టా రైతుల కష్టాలు తీర్చి, సంపద సృష్టించడమే," అని సీఎం వివరించారు. పట్టిసీమ విజయంతో రెండు ప్రాంతాలకు మేలు జరిగిందని చంద్రబాబు తెలిపారు. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లో వినియోగించుకోవడం ద్వారా పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమలోని సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించగలిగామని చెప్పారు. దీనివల్లే రాయలసీమలో 'కియా' వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు కూడా నీటిని అందించడం సాధ్యమైందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంపూర్ణ జల భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇరిగేషన్ క్యాలెండర్‌ను పక్కాగా అమలు చేసి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

## ప్రతిపక్షాల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి

**మొదటిపేజీ తరువాయి -** వెంకయ్యనాయుడు స్పందించారు. విపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని, రాజ్యాంగబద్ధ సంస్థలను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరికాదని ఆయన హితవు పలికారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారంటూ వస్తున్న ఆరోపణలు కేవలం అపోహ మాత్రమేనని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలతో సీఈసీ, ప్రధానమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సమంజసం కాదన్నారు. "రాజీనామా కోరడం తప్పు కాదు, కానీ రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదు" అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిస్తే తమ ఘనతగా చెప్పుకోవడం, ఓటమి పాలైతే ఈవీఎంలను నిందించడం కొన్ని పార్టీలకు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర సంస్థ అని, దానిని వీధుల్లోకి లాగడం దేశ ప్రతిష్టకు మంచిది కాదని అన్నారు. ఎన్నికల సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉన్నామని చెబుతున్నా, ప్రతిపక్షాలు ఎందుకు ఆందోళన చేస్తున్నాయో అర్థం కావడం లేదని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు.

## విద్యుత్ సమస్య ఉంది పొదుపుగా వాడుకోండి



**మొదటిపేజీ తరువాయి -** అందుబాటులో లేదని, ఉత్పత్తి అవుతున్న కరెంట్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యుత్ ఆధారిత పనులను తాత్కాలికంగా వాయిదా వేస్తే మంచిదని సూచించారు. ప్రతీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావంపై , సినిమా, మీడియా, వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

## రిగ్గింగ్ ఆధారాలుంటే చూపండి

**మొదటిపేజీ తరువాయి -** భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వరకు క్షేత్రస్థాయిలో పనిచేశాం. ఎటువంటి ఆధారాలు లేకుండా 'రిగ్గింగ్' అనే పదాన్ని ఎన్నికలపై విసరడం మనందరి ప్రజాస్వామిక విశ్వాసాన్ని గాయపరుస్తుంది," అని లేఖలో పేర్కొన్నారు. గతంలోని పరిస్థితులను గుర్తుచేస్తూ, "రిగ్గింగ్ ఎన్నికలు ఎలా ఉంటాయో మాకు బాగా తెలుసు. ఒకప్పుడు సినిమాల్లో చూపించినట్లు బూత్‌ల వద్ద కత్తులు, బాహుబలుల దౌర్జన్యాలు, బ్యాలెట్ బాక్సులను ఎత్తుకెళ్లడం వంటివి చూశాం. బూత్ కబ్జాలు సర్వసాధారణం కావడంతో 1989లో పార్లమెంట్ దీన్ని తీవ్రమైన నేరంగా ప్రకటించింది" అని వివరించారు. నేటి ఎన్నికల వ్యవస్థ పటిష్ఠతకు 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలే నిదర్శనమని వారు తెలిపారు. "ఒకప్పుడు బూత్ కబ్జాలకు మారుపేరైన బిహార్‌లో 2025 ఎన్నికల్లో ఒక్కచోట కూడా రీ-పోలింగ్ జరగలేదు. ఇది ఆ రాష్ట్ర చరిత్రలోనే ప్రథమం. 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం నమోదైంది. మహిళలు రికార్డు స్థాయిలో ఓటేశారు. ఇది అధికారులు సాధువులుగా మారడం వల్ల జరగలేదు. ఈసీ రూపొందించిన పటిష్ఠ వ్యవస్థ వల్లే సాధ్యమైంది" అని ప్రశంసించారు. ప్రస్తుత ప్రక్రియలో ప్రతి బూత్‌లోనూ అభ్యర్థుల ఏజెంట్లు ఉంటారని, పోలైన ఓట్లపై సంతకాలు చేసి పత్రాలు తీసుకుంటారని, ఏజెంట్ల సంతకాలతోనే మెషీన్లను సీల్ చేసి, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరుస్తారని వివరించారు. రిగ్గింగ్ జరగాలంటే వివిధ రాజకీయ పార్టీల ప్రభుత్వాలకు చెందిన వేలాది మంది అధికారులతో పాటు, ఓడిపోయిన పార్టీల ఏజెంట్లు కూడా మౌనంగా ఉండాలని, అంత పెద్ద కుట్ర ఎప్పటికీ సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలను ఉద్దేశించి "మీరు రిగ్గింగ్ జరిగిందని ఆరోపిస్తున్న వ్యవస్థే మీకు గతంలో విజయాలను అందించిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. మీరు వ్యవస్థను అనుమానిస్తున్నారా? కేవలం ఫలితాన్ని మాత్రమేనా? ప్రజలచే తిరస్కరణకు గురైన తర్వాత నిరాధార ఆరోపణలతో ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా తమ ఉనికిని కాపాడుకోవాలని చూడటం సరికాదు" అని వారు ఘాటుగా విమర్శించారు.

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు



**మొదటిపేజీ తరువాయి -** శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

## తెలంగాణలో ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు

**మొదటిపేజీ తరువాయి -** అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సాంస్కృతిక అస్థిత్వానికి, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగ తొమ్మిది రోజుల పాటు కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, యువతులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సంప్రదాయ వస్త్రాలు ధరించిన మహిళలు, తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకుని ఆలయాలు, సామూహిక ప్రదేశాలకు తరలివచ్చారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, చప్పట్లతో సందడి చేశారు. చారిత్రక హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడిలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంలోనూ ఉత్సవాలు నిర్వహించారు. నేడు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు, అక్టోబర్ 18న జరిగే సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. అక్టోబర్ 20న దసరా పండుగ జరగనుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత, నైవేద్యం ఉంటుంది. ఈ ఉత్సవాల కోసం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రధాన కూడళ్లను, ప్రభుత్వ కార్యాలయాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించింది. అక్టోబర్ 18న హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ప్రధాన సద్దుల బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సచివాలయం సమీపంలోని అమరవీరుల స్థూపం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా బయలుదేరి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘాట్ల వద్ద నిమజ్జనం చేస్తారు. ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చే ప్రజల కోసం ట్రాఫిక్ మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు వంటి పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, గ్రామాలు, పట్టణాల్లోని పాఠశాలల్లోనూ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తంగేడు, గునుగు వంటి సంప్రదాయ పూలతో బతుకమ్మలను పేరుస్తూ, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నారు.

## ఆఫ్రికా చెల్లింపుల వ్యవస్థలో యూపీఐ

**మొదటిపేజీ తరువాయి -** భారత్ అభివృద్ధి చేసిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సాంకేతికత అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ పొందుతోంది. తాజాగా ఆఫ్రికా దేశమైన జింబాబ్వే తమ దేశ చెల్లింపుల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు యూపీఐ సాంకేతికతను వినియోగించుకోవడంపై భారత్‌తో చర్చలు జరుపుతోంది. ఈ మేరకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అంతర్జాతీయ విభాగమైన ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్)తో జింబాబ్వే సంప్రదింపులు జరుపుతున్నట్లు ఒక నివేదిక వెల్లడించింది. ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే, జింబాబ్వేలోని బ్యాంకులు, మొబైల్ మనీ ఆపరేటర్లు, ఫిన్‌టెక్ సంస్థలు ఒకే వేదికపైకి వచ్చి రియల్ టైమ్ చెల్లింపులు జరిపేందుకు వీలు కలుగుతుంది. దీనివల్ల లావాదేవీల వ్యయం గణనీయంగా తగ్గడమే కాకుండా, నగదు బదిలీల వేగం కూడా పెరుగుతుందని జింబాబ్వే రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ జాన్ ముషయవాన్హు ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్న మొత్తాల దేశీయ లావాదేవీలకు డెబిట్, క్రెడిట్ కార్డులకు ప్రత్యామ్నాయంగా ఇది నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్ఐపీఎల్‌తో సాగుతున్న ఈ చర్చలు ఈ ఏడాది అక్టోబర్ 31 నాటికి ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం జింబాబ్వేలో డిజిటల్ లావాదేవీల సంఖ్య గణనీయంగానే ఉంది. 2025 నాలుగో త్రైమాసికంలో దేశవ్యాప్తంగా 238 మిలియన్ల ఎలక్ట్రానిక్ లావాదేవీలు నమోదు కాగా, వాటిలో 87 శాతం మొబైల్ మనీ ద్వారానే జరిగాయి. అయినప్పటికీ, ఈ లావాదేవీలకయ్యే ఖర్చు అధికంగా ఉంటోంది. ముఖ్యంగా విదేశాల నుంచి పంపే నిధులపై భారీగా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం, 2025లో ఆఫ్రికా దేశాలకు 200 డాలర్లు పంపడానికి సగటున 8 శాతం ఖర్చు అవుతుండగా, ప్రపంచ సగటు 6.5 శాతంగా ఉంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రకారం ఈ వ్యయం 3 శాతానికి మించకూడదు. యూపీఐ వంటి వ్యవస్థ అందుబాటులోకి వస్తే ఈ ఖర్చులు తగ్గి, మధ్యవర్తుల దోపిడీకి అడ్డుకట్ట పడనుంది. భారత యూపీఐ టెక్నాలజీ 2025 నాటికి ప్రపంచంలోని మొత్తం రియల్ టైమ్ లావాదేవీలలో 49 శాతం వాటాను కలిగి ఉండటం దాని సామర్థ్యానికి నిదర్శనం. జింబాబ్వేతో పాటు ఘనా, ఉగాండా, రువాండా, మొజాంబిక్ వంటి ఇతర ఆఫ్రికా దేశాలు కూడా యూపీఐ టెక్నాలజీపై ఆసక్తి కనబరుస్తున్నాయి. ఈ దేశాలు యూపీఐని స్వీకరిస్తే, మిగతా ఆఫ్రికా దేశాలకు ఇవే ప్రమాణాలుగా మారే అవకాశం ఉంది.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
తెలుగు దిన పత్రిక
www.epaper.tolivaartha.com
ఆదివారం 11 -10 - 2026

## కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా జాల మల్లేష్ యాదవ్

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సిఫార్సుతో నియామకం**



**చౌటుప్పల్, అక్టోబర్ 10 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆరెగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జాల మల్లేష్ యాదవ్ నియమితులయ్యారు.డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆయన నియామకాన్ని ఖరారు చేశారు.చౌటుప్పల్ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ రాజకీయాల్లో అనుభవం సంపాదించిన జాల మల్లేష్ యాదవ్,మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారు.ఎమ్మెల్యే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి,ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు అహర్నిశలు శ్రమించారు.ఆయనకు ఉన్న రాజకీయ అనుభవం,పార్టీ పట్ల నిబద్ధతను గుర్తించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,మండల రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించేలా ప్రధాన కార్యదర్శి పదవికి సిఫార్సు చేశారు.ఎమ్మెల్యే సిఫార్సు మేరకు డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య ఆయనను మండల ప్రధాన కార్యదర్శిగా నియమించారు.ఈ సందర్భంగా జాల మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకుల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు,రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి,డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్యకు,కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గోదావరి నుంచి ట్రాక్టర్లతో అక్రమ ఇసుక రవాణా !

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ అధికారులు**





**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 10 ( తొలివార్త ):** భద్రాచలం పట్టణంలో గోదావరి నది నుంచి అక్రమ ఇసుక రవాణా గురించి ముందుగానే ఆధారాలతో తెలియజేసిన ఫలితం శూన్యం? యదేచ్ఛగా అర్ధరాత్రి నుంచి పదుల సంఖ్యల ట్రాక్టర్లతో అక్రమ ఇసుక రవాణా? అక్రమ ఇసుక రవాణా గురించి సంబంధిత రెవిన్యూ మరియు, మైనింగ్, జియాలజీ అధికారులకు ఫోన్లు చేసిన ఫలితం శూన్యం? భద్రాచలంలో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై తెలియజేద్దామని మీడియా మిత్రులు ఫోన్లు చేసిన స్పందించని అధికారులు? అందులో ఆంతర్యం ఏమిటో? ఈ అక్రమ ఇసుక రవాణా నడిపించేది ఎవరు? దీనికి సహకరించేది ఎవరు? సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదు? దానికి కారణాలు ఏమిటి? భద్రాచలం ప్రాంతం ప్రజలలో అధికారులపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

**రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ - కొత్వాల**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 10 ( తొలివార్త ):** ఖమ్మం- నల్గొండ- వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటులి హక్కుకు అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకోవాలని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గ్రాడ్యుయేట్ యువకులు తమ సమస్యలను శాసనమండలిలో వినిపించేందుకు ప్రతి ఒక పట్టభద్రుడి భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందు తప్పనిసరిగా ఓటర్ నమోదు చేయించుకోవాలని అన్నారు. నిర్ణీత గడువు లోగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేయించుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కొత్వాల,అన్నారు. పట్టభద్రుల ఆశయాలను శాసనమండలిలో బలంగా వినిపించే అవకాశం కాంగ్రెస్ అభ్యర్థిని ఎన్నుకోవడం ద్వారా కల్పించాలని అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు విధిగా పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించేలా కృషి చేయాలి - కొత్వాలఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్లి జిల్లాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రుల ఓట్లు విధిగా నమోదు చేయించేలా కృషి చేయాలని కొత్వాల పిలుపు నిచ్చారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త (గ్రాడ్యుయేట్) తమ ఓటును,నమోదు చేసుకోవడంతో పాటు తమకు తెలిసిన వారి ఓట్లు కూడా నమోదు చేయించేలా కృషి చేయాలని కొత్వాల కోరారు.

## హాస్పటల్లో వైద్య చికిత్స పొందుతున్న సూది రెడ్డి గోపిరెడ్డిని పరామర్శించిన

**మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 10 ( తొలివార్త ):** అశ్వాపురం మండల మాజీ జెడ్పిటిసి సూది రెడ్డి సులక్షణ రెడ్డి భర్త మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సూదిరెడ్డి గోపిరెడ్డి అస్వస్థతకు గురవడంతో హైదరాబాద్ లోని శ్రీకర హాస్పిటల్,లో గోపి రెడ్డికి వైద్య, చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని వెళ్లిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు పినపాక నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఈ సందర్భంగా హాస్పటల్లో గోపిరెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని రేగ కాంతారావు ఆకాంక్షించారు.

## ఎర్రజెండాపై నమ్మకమే ఆర్టీసీలో గెలుపు

**సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్.**



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 10 ( తొలివార్త ):ప్రతి నిధి.** రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘం ఏఐటీయూసీ బలపరిచిన ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6000 పైచిలుకు ఓట్లతో ఘన విజయం సాధించడం వెనకాల ప్రజలు మరియు కార్మికులు ఎర్రజెండాపై ఉన్న నమ్మకం సూచిస్తుందని రాబోవు రోజుల్లో కూడా ప్రజలు ఎర్రజెండా వైపే చూస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ జీడిమెట్ల డిపోలో జరిగిన విజయోత్సవ సభలో పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి జీడిమెట్ల, కూకట్పల్లి ,ఉప్పల్, చెంగిచెర్ల, కుషాయిగూడ డిపోలలో సిపిఐ బలపరిచిన ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తు అత్యధిక మెజారిటీతో గెలిచిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మికులకు ఎన్ని ప్రలోభాల గురి చేసినప్పటికీ కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్ ద్వారానే ఆర్టీసీ పరిరక్షణ అని అనుకోవడం వల్లే నేడు భారీ మెజార్టీతో గెలిచిందని ఇది నీతికి నిజాయితీకి మరియు అధికారం డబ్బు అహంకారానికి మధ్య జరిగిన పోరాటంగా కార్మికులు భావించారని ఇదే విజయం రాబోయే ఎన్నికల్లో కూడా కనిపిస్తుందని అన్నారు. పూర్తిగా తీసుకొని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన నాయకులను గెలిపించాల్సిందిగా కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినంతవరకు ఎంప్లాయిస్ యూనియన్ మరియు జెఏసి చేసే అన్ని పోరాటాల్లో సిపిఐ కలిసి వస్తుందని ఆర్టీసీ కార్మికులకు ఎల్లవేళలా సిపిఐ తోడ్పాటు ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డిపో యూనియన్ కార్యదర్శి డేనియల్ అధ్యక్షులు పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, రాములు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్,నాయకులు నరసింహ రెడ్డి, ప్రజెంట్ మండల అధ్యక్షులు బాబు, మహేందర్, బి ఎల్ నారాయణ ,బాలయ్య రాజేష్, కయ్యం, భాస్కర్, శేఖర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా కేంద్రంలో కదం తొక్కిన గులాబీ శ్రేణులు

**జిల్లా ఏర్పాటై దశాబ్దం పూర్తి - దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 2కె రన్**

**జిల్లా ఇచ్చిన కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు**



**సూర్యాపేట అక్టోబర్ 10 ( తొలివార్త ):** సూర్యాపేట జిల్లా ఏర్పాటై 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దశాబ్ది పండుగ ఉత్సవాలను బీఆర్ఎస్ పార్టీ ఘనంగా నిర్వహించింది. ఇందులో భాగంగా శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో 2ఖ రన్ నిర్వహించారు. సూర్యాపేట జిల్లాను ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ ర్యాలీని నిర్వహించారు. సద్దల చెరువు నుండి కొత్త బస్ స్టాండ్ వరకు 2 కిలోమీటర్ల మేర ఈ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, పట్టణ ప్రజలు, యువత భారీగా పాల్గొని గులాబీ జెండాలతో కదం తొక్కారు. సూర్యాపేట, తుంగతుర్తి, హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల నుండి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు డా. గాదరి కిషోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ దీపిక యుగేందర్ రావు, హుజూర్ నగర్ నియోజకవర్గ ఇంచార్జి నర్సిరెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వెంకట నారాయణ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణ, రాష్ట్ర కార్యదర్శి వై.వి. తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... జిల్లా ఏర్పాటైన తర్వాత ఊహకందని విధంగా సూర్యాపేట అభివృద్ధి చెందిందని అన్నారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి గారు అహర్నిశలు కృషి చేసి జిల్లాకు కలెక్టరేట్, ఎస్పీ ఆఫీస్, మెడికల్ కాలేజీ, ట్యాంక్ బండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, SRSP జలాలు, గురుకులాలు తీసుకువచ్చారని, నియోజకవర్గంలో 6 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. ముందుచూపు, దూరదర్శనితతో కేసీఆర్ గారు ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలు అభివృద్ధికి ముఖద్వారాలుగా నిలిచాయని అన్నారు. ముఖ్యంగా సూర్యాపేట జిల్లా అద్భుతమైన అభివృద్ధి సాధించిందని, పాలన ప్రజల ముంగిటకు వచ్చిందని తెలిపారు. కంటి ముందు అధికారి, ఇంటి ముందు అభివృద్ధితో నూతన జిల్లాల్లో సమ్మిళిత అభివృద్ధి జరిగిందని, ఏ చిన్న సమస్య వచ్చినా కలెక్టర్ స్థాయి అధికారి ప్రజల వద్దకు వచ్చారని, ఎస్పీల నియామకంతో క్రైమ్ రేటు తగ్గిందని, జిల్లాలో నాయకత్వం, తలసరి ఆదాయం పెరిగిందని నేటి తరం యువతకు విడమరచి చెప్పారు.

# ప్రజాస్వామ్య గొంతుకపై ఉక్కుపాదం ఇది పాలనా లేక అప్రకటిత ఎమర్జెన్సీనా

**ఆనాడు కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ..**

**నేడు బీజేపీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు**





**ఎల్.బి.నగర్ అక్టోబర్ 10 ( తొలివార్త ):** ఆనాడు కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తే, నేడు బీజేపీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను సృష్టిస్తూ, ప్రతిపక్షాల గొంతును నొక్కుతూ, ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓటర్ల పేర్లను అనైతికంగా తొలగిస్తోందనే ఆరోపణలు ప్రజాస్వామ్యంపై ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఓటు చోరీ, ఓటర్ల జాబితాలో అక్రమాలపై వ్యక్తమవుతున్న ఆందోళనలకు మద్దతుగా ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

**SIR పేరుతో అర్హులైన ఓటర్ల తొలగింపుపై నిరసన**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR) ప్రక్రియ పేరుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అర్హులైన ఓటర్ల పేర్లు పెద్దఎత్తున తొలగిస్తున్నారనే ఆరోపణలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, జవాబుదారీతనం పాటించాలని డిమాండ్ చేశారు.ంప్రజాస్వామ్యానికి గుండెకాయ లాంటి భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అణచివేస్తూ, ప్రశ్నించే గొంతులకు సంకెళ్లు వేస్తూ, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను నిర్బంధిస్తున్న చర్యలను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్రంగా ఖండిస్తోంది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఓటింగ్ ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, AI సాంకేతికతను ఉపయోగించి ప్రతిపక్షాల ఓట్లను లక్ష్యంగా చేసుకుని, SIR ప్రక్రియ ద్వారా మోదీ ప్రభుత్వం అక్రమంగా ఓటర్ల పేర్లను తొలగిస్తోందనే ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**నిరసన హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం**

దేశ రాజధానిలో నిర్బంధ వాతావరణం నెలకొన్నట్లుగా సాగుతున్న చర్యలు ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. 57 మెట్రో స్టేషన్లను మూసివేయడం, సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకున్న తర్వాత కూడా 40 స్టేషన్లలో రాకపోకలకు అంతరాయం కలగడం, నార్తర్న్ రైల్వే పరిధిలో 38 రైళ్లను రద్దు చేయడం వంటి పరిణామాలతో సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారనే అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులను, ప్రయాణికులను ఇటార్సీ--భోపాల్ స్టేషన్ల వద్ద అడ్డుకోవడం, తెలంగాణ నుంచి తమ హక్కుల కోసం తరలివెళ్లిన విద్యార్థులను భోపాల్లో నిర్బంధించడం వంటి చర్యలు శాంతియుత నిరసన తెలిపే హక్కుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.ఈ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని అన్నారు.అరెస్టు చేసిన విద్యార్థులను వారి వారి రాష్ట్రాలకు క్షేమంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.బిజెపి ఫేక్ మీడియా ద్వారా దేశద్రోహులని,పాకిస్తాన్ గూడచారులని,చైనా గూడచారులని,జార్జ్ సోరస్ మనిషి అనే ముద్రలు వేసే ప్రయత్నం మీ ఫేక్ మీడియా ద్వారా చేయకండి.మీరు గత 12 సంవత్సరాలుగా చేస్తున్న ప్రయత్నాలు ఇవన్నీ.ఒక శాంతియుత ప్రజాస్వామ్య నిరసనను అడ్డుకోవడానికి వేలాది మంది పోలీసులను మోహరించాల్సిన అవసరం ఏమిటి? ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పాలకులు, ప్రజల గొంతులను అణచివేయడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారు? ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కును గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై లేదా?

**ఎమర్జెన్సీ చరిత్రను గుర్తుచేస్తున్న ప్రస్తుత పరిణామాలు**

1975లో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిపోయింది. నేడు ప్రజల హక్కులను అడ్డుకునే చర్యలు కొనసాగితే, అవి మరోసారి అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులను తలపిస్తాయి. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే నిరంకుశ పోకడలనైనా బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుంది.

**ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలి**

ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఈ ధర్నా ద్వారా బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పాలకులు గుర్తుంచుకోవాలి -- నిర్బంధాలతో ప్రజాగ్రహాన్ని ఆపలేరు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుత నిరసన, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదులు. ప్రజల హక్కులను కాపాడటం, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం కోసం బీఆర్ఎస్ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుంది. ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,ఉద్యమకారులు,మహిళలు,కార్యకర్తలు పాల్గొని ఓటు హక్కు పరిరక్షణకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

**ఓటు హక్కు మన హక్కు -- ప్రజాస్వామ్య పరిరక్షణ మన బాధ్యత!**

# కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను,20 లబ్ధిదారులకు అందజేసిన

**ఎమ్మెల్యే,ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు**





**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 10 ( తొలివార్త ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండల తహసీల్దార్ కార్యాలయంలో పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే తెలంగాణ ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 20 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడంలో ఈ పథకాలు ఎంతో తోడ్పడుతున్నాయని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి కుటుంబాలకు భరోసా కల్పించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తిస్తూ సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. పేదల సంక్షేమం, మహిళల సాధికారత, అర్హులైన కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో భాగమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సంబంధిత పథకాలకు అర్హత ఉన్నవారు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పినపాక నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ, ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు, ఇక్బాల్ హుస్సేన్, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యోగా సాధనకు స్థలం కేటాయించాలని కొలన్ హన్మంత్ రెడ్డి కి వినతి



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 10 ( తొలివార్త ):ప్రతి నిధి.** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి నిఈరోజు నిజాంపేట్కు చెందిన పతంజలి యోగా టీమ్ వెల్నెస్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి, యోగా సాధన, ధ్యానం నిర్వహించేందుకు అనువైన స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.గత ఎనిమిదేళ్లుగా నిజాంపేట్లో యోగా, ధ్యానం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం ఎండ, వర్షం, వాహనాల కాలుష్యం, రోడ్డు భద్రత వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అసోసియేషన్ సభ్యులు వివరించారు. యోగా సాధనకు అనువైన స్థలం కల్పించి తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, పతంజలి యోగా టీమ్ వెల్నెస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## న్యాయపరమైన చిక్కులను తొలగించి మున్సిపల్ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించండి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 10 ( తొలివార్త ): ప్రతి నిధి.** బాచుపల్లి మండలం సర్వే నెంబర్ 233/1 లో శంకుస్థాపన గావించి కోర్టు చిక్కులతో నిలిచిపోయిన సీఎంసీ నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ నూతన కార్యాలయ భవన నిర్మాణ స్థలాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. సీఎంసీ నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయ నిర్మాణానికి గతంలో నాలుగు ఎకరాలను కేటాయించి శంకుస్థాపన చేయడం జరిగిందని, కానీ కొన్ని కోర్టు సమస్యలతో పనులను ప్రారంభం కాలేదు. రెవెన్యూ పరంగా న్యాయపరమైన చిక్కులను తొలగించి మున్సిపల్ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ మల్లేశ్వర్ రావు, సాయి, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం కోసం అర్హత గల ప్రతి ఒక్కరూ ఎల్వోసీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి బిఆర్ఎస్ నాయకులు.



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 10 ( తొలివార్త ): ప్రతి నిధి.** పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రత్యేక చొరవతో సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ కింద 131- కుత్బుల్లాపూర్ డివిజన్ అంబేద్కర్ నగర్ కి చెందిన కె. రాంరెడ్డి తండ్రి లేట్ కె.నారాయణ్ (రూ.1,50,000/-) మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన నాయకులు ఈరోజు చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ కార్యాలయంలో స్థానిక డివిజన్ నాయకులు లబ్ధిదారుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.నియోజకవర్గంలో ప్రతీ పేదవారికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రజా సేవకై పనిచేసే నాయకులు మన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గారు అని అన్నారు. కావున అర్హులైన ప్రతీ పేదవారు మెరుగైన వైద్యం కోసం ఎల్వోసీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, ఎండి.నసీరుద్దీన్, రమణారెడ్డి, ఆంజనేయులు, కొత్త నరసింహారెడ్డి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కి ఆహ్వానం



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 10 ( తొలివార్త ): ప్రతి నిధి.** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ని ఈరోజు నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి, శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే దుర్గాదేవి పూజా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొనాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను అందజేశారుఈ సందర్భంగా పలు కాలనీలకు చెందిన సభ్యులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కూన శ్రీశైలం గౌడ్ గారి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులతో పాటు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను రద్దు చేయాలి భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించుదాం

**సిఇసి జ్ఞానేష్ కుమార్ ను పదవి నుండి వెంటనే తొలగించాలి.**

**ఖమ్మం జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ర్యాలీ నిరసన ప్రదర్శన.**



**ఖమ్మం అక్టోబర్ 10 ( తొలివార్త ):** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్స్ యు రివిజన్ వెంటనే రద్దు చేయాలని ఖమ్మం లోని అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన జరిగిన కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ పాల్గొన్నారు. ర్యాలీ మరియు నిరసన ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా హాజరైన యూఎస్పీ రాష్ట్ర కమిటీ నాయకులు దేవరకొండ సైదులు టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విజయ్ ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు పి నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని దేవరకొండ సైదులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతతో కలిగించే సర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విజయ్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ లో మెజారిటీ సభ్యుల అంగీకారం లేకుండా సర్ ప్రక్రియ అమలకు ముఖ్యకార్ములైన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ను పదవి నుండి వెంటనే తొలగించాలని అన్నారు. టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ మాట్లాడుతూ సిఈసి ఏకపక్షం నిర్ణయాలు సమీక్షించాలని ఎన్నికల కమిషన్ నియామకం 20 23న రద్దు చేయాలని 20 24 తర్వాత జరిగిన అన్ని ఎన్నికలపై విచారణ చేపట్టాలని సర్ ప్రక్రియ ద్వారా 13 కోట్ల పౌరుల ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు లాంటిదే అని అన్నారు. టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు మాట్లాడుతూ మరణించిన ఓట్లను డబుల్ ఓట్లను తొలగించడంలో ఎవరికీ అభ్యంతరం లేదన్నారు కానీ బతికున్న వారిని వివిధ అసంబంధాత కారణాలతో ఓటు హక్కును నిరాకరించడానికి వ్యతిరేకిస్తున్నాము అని అన్నారు. ఓటర్లు పాలకులను ఎన్నుకునే పరిస్థితి నుండి పాలకులే తమకు అనుకూలమైన వారిని ఓటర్లుగా ఎంపిక చేసుకునే దుస్థితి వచ్చిందని అన్నారు. ఈ ర్యాలీ నిరసన ప్రదర్శన రాష్ట్ర నాయకులు పినాగిరెడ్డి బాసన్ షేక్ మన్సూర్ జి వెంకటేశ్వర్లు బి శంకర్ యాకయ్య దేవేందర్ కుమార్ స్వామి మంకీలాల్ రామకోటి ఉపేందర్ ఉదుండు షరీఫ్ సర్వర్ బాబు మూడు పుల్లయ్య మల్లికార్జునరావు ఖాదర్ బద్రు వేరన్న తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో జాతీయ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**ఆర్ అండ్ బి శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన**

**తెలంగాణ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



భద్రాద్రి జిల్లా **అక్టోబర్ 10 ( తొలివార్త ):** బూర్గంపాడు మండలంలో తెలంగాణ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్, పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే, పాయం వెంకటేశ్వర్లు ఆర్ అండ్ బి, (రోడ్లు, భవనాల శాఖ) అధికారులతో శుక్రవారం నాడు, సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ ˊందర్భంగా,నియోజకవర్గంలోని రహదారుల పరిస్థితి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నిర్మాణంలో ఉన్న రహదారుల పురోగతి తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట కొత్త రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను,కోరారు.ప్రభుత్వం మంజూరు చేసిన రహదారి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, తెలిపారు. పినపాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధి పనుల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు.

# జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి

**ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం**

**వలిగొండలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన**



**వలిగొండ । అక్టోబర్ 10 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ, ఢిల్లీలో నిరసన తెలిపేందుకు బయలుదేరిన సీపీఎం జాతీయ కార్యదర్శి ఎం.ఏ. బేబీతో పాటు ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులను అరెస్టు చేయడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారు**

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగ స్వామి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని నిరసనలు వ్యక్తమవుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు ముందుకు వచ్చిన నాయకులపై నిర్బంధ చర్యలు చేపట్టడం, పోలీసుల ద్వారా అణచివేతకు ప్రయత్నించడం, ఢిల్లీకి వెళ్లేందుకు రైళ్ల రాకపోకలను రద్దు చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై నిరసన తెలపడం పౌరుల ప్రాథమిక హక్కులని వారు పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం సరైన విధానం కాదని అన్నారు. ప్రజల గొంతుకను అణచివేయాలని చూస్తే కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

**ఓటర్ల జాబితాలపై సమాధానం చెప్పాలి**

దేశంలో సుమారు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించారంటూ సీపీఎం నాయకులు ఆరోపించారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల పేర్ల తొలగింపుపై కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా స్పందించాలని, ఈ వ్యవహారానికి బాధ్యుడిగా తాము పేర్కొంటున్న జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాలని, ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఉండాలని వారు సూచించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు.

**నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు**

ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించడంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకులను అరెస్టులు, నిర్బంధాలతో అడ్డుకోవడం ద్వారా ఉద్యమాలను నిలువరించలేరని పేర్కొన్నారు. శాంతియుత నిరసనలకు అవకాశం కల్పించాలని, ప్రజల హక్కులను గౌరవించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**పాల్గొన్న నాయకులు**

ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కూర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కల్కూరి రామచంద్రర్, కవిడే సురేష్, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, సహాయ కార్యదర్శి నానాచర్ల రమేష్, నాయకులు కొండూరు సత్తయ్య, శీలం ఇందిర, ధ్యానబోయిన యాదగిరి, పైళ్ల సత్తిరెడ్డి, ఆలకుంట్ల నరసింహ, వేముల లక్ష్మయ్య, గంగాపురం వెంకటేష్, కోరబోయిన మహేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడులో ఘనంగా బతుకమ్మ సంబరాలు ఆడబిడ్డలకు ప్రత్యేక ఆహ్వానం

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్**




**కోమటిరెడ్డి లక్ష్మి చౌటుప్పల్, అక్టోబర్ 10 ( తొలివార్త ):** తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మునుగోడు నియోజకవర్గ స్థాయిలో భారీ బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తెలిపింది.

**కార్యక్రమ వివరాలు:**

తేదీ: అక్టోబర్ 11,ఆదివారం 2026
సమయం: సాయంత్రం 5:00 గంటలకు

**వేదిక:**

మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణ

ఈ వేడుకలకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ఆడబిడ్డలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొననున్నారు.మునుగోడు నియోజకవర్గంలోని 7 మండలాల నుంచి మహిళలు,కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు,కార్యకర్తలు,పెద్ద ఎత్తున బతుకమ్మలతో హాజరుకానున్నారు.ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు,మహిళలకు చీరల పంపిణీ కూడా ఉంటుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ "బతుకమ్మ అనేది తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక.తెలంగాణ సంస్కృతిని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉంది.నియోజకవర్గంలోని ప్రతి ఆడబిడ్డ ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు.కావున మునుగోడు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,మండల అధ్యక్షులు,సర్పంచులు, ఎంపీటీసీలు,కార్యకర్తలు,కోమటిరెడ్డి అభిమానులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఈ వేడుకలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కోరింది.

# స్మశాన వాటికలో పెరిగిన ముండ్ల చెట్లను బ్లేడ్ ట్రాక్టర్ తో తొలగించి అభివృద్ధికి శ్రీకారం చుట్టిన

**సర్పంచ్ మడకం మూలమ్మ**





**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 10 ( తొలివార్త ):** అశ్వాపురం మండలంలో ని వెంకటాపురం, గ్రామపంచాయతీ పరిధిలోని మావుల వాయి వెళ్లే గ్రామం మార్గంలో ఉన్న స్మశాన వాటిక లో ఉన్న పచ్చి గడ్డిని ముండ్ల పొదలను, తొలగించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్మశాన వాటికలో మొలిచినటువంటి కలుపు మొక్కలను ముళ్ళ చెట్లు పిచ్చి మొక్కలను, బ్లేడ్ ట్రాక్టర్ తో తొలగించారు ఈ పనులను వెంకటాపురం సర్పంచ్ మడకం మూలమ్మ, దగ్గరుండి పర్యవేక్షించారు.స్మశాన వాటిక పరిసరాల్లో పెరిగిన, పచ్చి గడ్డి మరియు ఆ ప్రదేశంలో మొలచిన పిచ్చి మొక్కలను తొలగించి, స్మశాన వాటిక స్థలంలో పరిసరాలను పరిశుభ్రంగా చేస్తున్నామని గ్రామ పరిసరాల పరిశుభ్రతను కాపాడటం, గ్రామాల ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. సర్పంచ్ మడకం మూలమ్మ, తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు మండల ఆదివాసి నాయకులు మడకం శరత్ గ్రామస్తులు మడకం బద్రి తాటి శ్రీను, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 20వ వార్డులో ఘనంగా ఎంగిలిపూల సంబరాలు

**ముఖ్య అతిథిగా పాల్గొన్న 20వ వార్డు కౌన్సిలర్**

**ఎండి హన్ను బాయ్**





**చౌటుప్పల్, అక్టోబర్ 10 ( తొలివార్త ):** తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగలో తొలి రోజైన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు చౌటుప్పల్ మున్సిపాలిటీ 20వ వార్డులో ఘనంగా ప్రారంభమయ్యాయి. 20వ వార్డు కౌన్సిలర్ హన్నుబాయ్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి,ఆటపాటలతో సంబురంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అన్నుబాయ్ మాట్లాడుతూ "బతుకమ్మ అంటేనే ఆడబిడ్డల పండుగ.తొలి రోజైన ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల పాటు మన ఆడబిడ్డలు ఎంతో ఆనందంగా జరుపుకుంటారు.20వ వార్డులోని ప్రతి మహిళా ఈ సంబరాల్లో భాగస్వామి కావడం సంతోషంగా ఉంది.రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగకు ఇస్తున్న ప్రాధాన్యత వల్ల మన సంస్కృతి మరింత వెలుగొందుతోంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మహిళలు,మహిళా సంఘాల సభ్యులు,స్థానిక కాంగ్రెస్ నాయకులు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నియోజకవర్గ ప్రజలకు ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు

**ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 10 ( తొలివార్త ):** భద్రాచలం నియోజకవర్గ ప్రజలందరికీ ఎంగిలిపూల, బతుకమ్మ, పండుగ ,శుభాకాంక్షలు, తెలియజేస్తున్నట్లు భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తెలంగాణ,ఆడపడుచులు, నియోజకవర్గ ప్రజలందరూ, భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆకాంక్షించారు.ప్రకృతిని పూజిస్తూ, రంగురంగుల తీరొక్క పూలను అందంగా పేర్చి బతుకమ్మను కొలిచే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీక అని తెలిపారు.అదేవిధంగా దసరా నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో,సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో ని ప్రజలందరూ బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకుంటూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు,ప్రజలకు, విజ్ఞప్తి చేశారు.

# సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు డివి శంకర్రావు ప్రపంచ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 10 ( తొలివార్త ):** భద్రాచలం పట్టణంలో సిటీ స్టైల్ జిమ్,కోచ్,జివి,రామిరెడ్డి.తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలానికి చెందిన డి.వి. శంకర్ రావు స్ఫూర్తిదాయకమైన ప్రయాణం ఎంతో మందికి ఆదర్శం.రిటైర్డ్ బ్యాంక్ అధికారి అయిన ఆయన తన జీవితంలో ఎదురైన ఆరోగ్య సవాళ్లను లెక్కచేయకుండా ఫిట్‌నెస్ రంగంలో సంచలనాలు సృష్టించారు. ఆయన సాధించిన అద్భుత విజయాల విషయానికొస్తే,బైపాస్ సర్జరీని లెక్కచేయకండా శంకర్ రావు,కి 2012లో 60 సంవత్సరాల వయసులో గుండె సంబంధిత సమస్య కారణంగా కరోనరీ బైపాస్ సర్జరీ జరిగింది. సాధారణంగా ఇటువంటి పెద్ద ఆపరేషన్ తర్వాత చాలామంది శారీరక శ్రమకు దూరంగా ఉంటారు. కానీ శంకర్రావు తన ఆరోగ్యాన్ని మరింత సానుకూలంగా మలుచుకున్నారు. వయసు పెరుగుతున్న కొద్దీ శరీరాన్ని, ఫిట్‌గాఉంచుకోవాలనే ఉద్దేశంతో, భద్రాచలంలోని సిటీ స్టైల్ జిమ్' లో తన కోచ్ జి.వి.రామిరెడ్డి పర్యవేక్షణలో శిక్షణ ప్రారంభించారు.జిమ్‌లో చేరిన అతి తక్కువ కాలంలోనే పవర్ లిఫ్టింగ్‌పై దృష్టి పెట్టారు. కేరళలోని కోజికోడ్ వేదికగా జరిగిన నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారు. నాలుగు బంగారు పతకాలు: స్క్వాట్ బెంచ్ ప్రెస్ డెడ్‌లిఫ్ట్ విభాగాలతో పాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లోనూ కలిపి మొత్తం నాలుగు స్వర్ణ పతకాలను సాధించి చరిత్ర సృష్టించారు. బైపాస్ సర్జరీ అయిన వారు జాతీయ స్థాయిలో ఈ స్థాయిలో పతకాలు సాధించడం వైద్య రంగంలోనూ, క్రీడా రంగంలోనూ ఒక అరుదైన రికార్డు.వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని,పట్టుదల ఉంటే ఏ వయసులోనైనా అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని నిరూపించి తెలంగాణ కీర్తిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశారు. ఈ కార్యక్రమం లో సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి, మైదిరెడ్డి రామిరెడ్డి, కురినాల వెంకటేశ్వర్లు,పాల్ బర్లి ఐ వెంకటేశ్వరరావు, గాదె నిశాంత్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

# శాలిగౌరారంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**శాలిగౌరారం, అక్టోబర్ 10 ( తొలివార్త ):** మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, యువతులు ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామాల్లో పండుగ శోభ సంతరించుకోగా, ఎక్కడ చూసినా రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, అందంగా అలంకరించిన బతుకమ్మలను తీసుకుని వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆటపాటలతో సందడి చేశారు. డీజే పాటల హోరుకు అనుగుణంగా యువతులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సంబరాలను మరింత హుషారెత్తించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వేడుకల్లో పాల్గొని ఆనందంగా గడిపారు. పూల అందాలు, సంప్రదాయ ఆటపాటలతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# మండలంలోని ప్రజలకు ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన

**మండల కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పాయం భద్రమ్మ, సర్పంచ్ కొండ్రు అంజమ్మ**





**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 10 ( తొలివార్త ):** అశ్వాపురం మండల ప్రజలందరికీ ఎంగిలిపూల బతుకమ్మ,పండుగ,శుభాకాంక్షలు,తెలియజేస్తున్నట్లు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకురాలు గొందిగూడెం కొత్తూరు, సర్పంచ్ కొండ్రు అంజమ్మ, మరియు గొందిగూడెం మాజీ సర్పంచ్ పాయం భద్రమ్మ,లు వారు ఇరువురు, పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అశ్వాపురం మండల, వ్యాప్తంగా, ఆడపడుచులు, భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాలతో, జరుపుకోవాలని, కోరుతూ ప్రకృతిని, పూజిస్తూ రంగురంగుల తీరొక్క పూలను అందంగా పేర్చి బతుకమ్మను కొలిచే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల, మహిళా సోదరీమణుల, ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీక అని,వారు తెలిపారు.అదేవిధంగా దసరా నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని,వారు కోరారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో,సుఖసంతోషాలుఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని, మండల కాంగ్రెస్ పార్టీ, సీనియర్ నాయకురాలు పాయం భద్రమ్మ, సర్పంచ్ కొండ్రు అంజమ్మ,లు, వారు ఇరువురు ఆకాంక్షించారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సేవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం



**సూర్యాపేట( నేరేడుచర్ల) అక్టోబర్ 10 ( తొలివార్త ):** ఈరోజు మహాలయ అమావాస్య సందర్భంగా ఉదయం 8:00 గం.లకు" మహా అల్పహారం "(టిఫిన్స్) దాదాపు 500 మందికి పెట్టటం జరిగినది. మరియు మధ్యానం 12:30 ని.లకు "మహా అన్నాసంతర్పణం"( అన్నదానం) దాదాపు 600 మందికి పెట్టటం జరిగినది ఇట్టి కార్యక్రమము 24 నెలల నుండి దాతల సహాయ సహకారాలతో జరుగుచున్నది. పితృదేవతల పేరుమీదా ఈ రోజుఅన్నదానం చేయటం చాలా మంచి రోజు. కావున దాతల అందరికి కమిటి వారు పేరు పేరున వారికి చెతులెత్తిశతకోట నమస్కరాలు తెలియ చేయుచున్నారు.మన తెలంగాణాలో ఇంత గొప్పగా జరిగేది మన నేరేడుచర్లలోనే. కావున ఇట్టి కార్యక్రమాలలో పాల్గొన్నా వారు. రాచకొండ శ్రీనివాసరావు. వుట్కూరి నటరాజు. కందిబండ శ్రీనివాసరావు. వుప్పల పుల్లయ్య. పోలిశెట్టి వెంకటశ్వర్లు .రాచకొండ రాంచంద్రరావు. తాళ్లూరి లక్ష్మినారయణ. తడక మళ్ల లక్ష్మీనర్సిం హస్వామి.భోనగిరి అంజయ్య. పోతుగంటి సత్యనారయణ . జులురి అశోక్ .తడకమళ్ల పరమేశం. నిలా రాంముర్తి. కట్టమూరి మధు .గరిణె వెంకన్న . అనంతుల సత్యనారయణ .జగిని సురేశ్. పోలిశెట్టి అశోక్. రాచకొండ విజయ్. ఓరుగంటి గణేశ్. నిలా శ్రీనివాస్.గుండా సత్యనారయణ . గుంటూరు రవి. విరవెల్లి శ్రీనువాస్. పాలు వాయిగోపాలకృష్ణ. చారగుండ్ల వెంకటేశ్వర్లు.చెరుకు రాము. వెంపటి సత్యం .గజవెల్లి నర్సింహ్మారావు . రాచకొండ సురేశ్. బొడ్డు నాగేశ్వరావు. గరిణె వాసు .కోక్కండ్ల వెంకటేశ్వర్లు చెక్క లక్ష్మణ్ . ఇట్టి కార్యక్రమాన్ని అందరు కలస దిగ్విజయంగా చేసినారు కావున సేవలో పాల్గొన్ని వారికి కమిటి వారుప్రత్యేక ధన్యవాదము తెలియ చేయుచున్నరు

## కలవలనాగారంలో 800 లీటర్ల నాటుసారా పానకం ధ్వంసం

నాటు సారా తయారీ రవాణా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు ఎక్సైజ్ శాఖ సిఐ



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 10 ( తొలివార్త ):** కరకగూడెం మండలంలో కలవలనాగారం గ్రామంలో ఆదివారం, మణుగూరు ఎక్సైజ్, ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్, కొత్తగూడెం డీటీఎఫ్ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించి 800 లీటర్ల పులియబెట్టిన బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశాయి. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు.

## మల్లికార్జున్ నగర్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు



**నాచారం, అక్టోబర్ 10 ( తొలివార్త ):** నాచారం సర్కిల్ పరిధిలోని శక్తిసాయి నగర్ డివిజన్ మల్లికార్జున్ నగర్ కాలనీలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు రవీందర్ సాగర్, లలిత ఆధ్వర్యంలో ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. మహిళల కోలాహలం మధ్య వేడుకలు ఆనందోత్సాహాలతో సాగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కాలనీ మహిళలు ఐకమత్యంతో ఘనంగా జరుపుకున్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థిని



**శాలిగౌరారం, అక్టోబర్ 10 ( తొలివార్త ):** రాష్ట్రస్థాయి అండర్--19 బాలికల కబడ్డీ పోటీలకు వల్లాల ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎస్‌కే నస్రీన్ ఎంపికైంది. ఈ నెల 9న హాలియాలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ అసోసియేషన్ పోటీల్లో పదో తరగతి చదువుతున్న నస్రీన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ నెల 10 నుంచి 13 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఆమె పాల్గొననుంది. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్ ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని నస్రీన్‌తో పాటు ఆమెకు శిక్షణ అందించిన పాఠశాల పీడీ బొడ్డు మల్లేశ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థిని క్రీడల్లో మరింత రాణించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## నూతన దుర్గామాత విగ్రహాల ఏర్పాటుకు అనుమతి లేదు

శాలిగౌరారంఎస్సై పి. బాబు



**శాలిగౌరారం అక్టోబర్ 10 ( తొలివార్త ):** శాలిగౌరారం మండలంలో గతేడాది విగ్రహాలు ఏర్పాటు చేసిన వారే ఈ ఏడాది ఏర్పాటు చేసుకోవాలని, వారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో వివరాలు సమర్పించాలని ఎస్సై పి. బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గామాత విగ్రహాల వద్ద ఇద్దరు సభ్యులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు

## శ్రీరామ్ నగర్ కాలనీలో
## ఘనంగా ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుక

ప్రకృతిని పూజించే పండుగ



**హయత్ నగర్ అక్టోబర్ 10 ( తొలివార్త ):** ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగిసే ఈ తొమ్మిది రోజుల పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి,ప్రకృతితో మమేకమైన మన జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తుందని పూలను పూజించే అపురూపమైన సంప్రదాయం బతుకమ్మ పండుగ ప్రత్యేకత అని,తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే ఈ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు,ప్రతి కుటుంబంలో సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు.చెరువులు,ప్రకృతి వనరుల పరిరక్షణ ప్రాముఖ్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ మన సంస్కృతిని భావితరాలకు అందించే గొప్ప వారసత్వమని అన్నారు.మహిళలు,యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి,రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి,పాటలు పాడుతూ,ఆటలాడుతూ జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఐక్యతకు,మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తుంది ఇట్టి గొప్ప పండుగని హయత్ నగర్ పరిధి లోని శ్రీరామ్ నగర్ కాలనీ వాసులు మహిళలు ఘనంగా జరుపుకున్నారు

## ఎన్టీఆర్ వైద్య సేవల్లో అక్రమాలు
## 203 ఆసుపత్రులకు రూ.34.39 కోట్ల జరిమానా

వైద్యసేవలు, నిర్దేశిత ప్రమాణాలు, బిల్లుల సమర్పణలో అక్రమాలకు పాల్పడుతున్న

నెట్‌వర్క్ ఆసుపత్రులపై ఎన్టీఆర్ వైద్య సేవల ట్రస్ట్ కొరడా ఝుళిపించింది.

రోగులకు వైద్యసేవలు అందించడంలో, బిల్లుల సమర్పణలో, నిర్దేశిత ప్రమాణాలను పాటించడంలో అక్రమాలకు పాల్పడుతున్న నెట్‌వర్క్ ఆసుపత్రులపై ఎన్టీఆర్ వైద్యసేవల ట్రస్ట్ చర్యలు తీసుకుంది. 2024--2025 నుంచి 2026--2027 వరకు రాష్ట్రవ్యాప్తంగా 203 ఆసుపత్రులపై రూ. 34.39 కోట్ల జరిమానాలు విధించింది. మరోవైపు మొత్తం 44 ఆసుపత్రులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. 25 హాస్పిటల్స్?ను సస్పెన్షన్ చేయగా, 13 ఆసుపత్రులకు చెల్లింపులు నిలిపివేశారు. మరో ఐదింటిని జాబితా నుంచి తొలగించగా ఒక హాస్పిటల్? గుర్తింపు రద్దు చేశారు. ఆసుపత్రుల్లో అవకతవకలను గుర్తించేందుకు కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికతను వినియోగిస్తూ జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ సహకారంతో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ బిల్లుల పరిశీలన, వైద్యతనిఖీలు నిర్వహిస్తోంది. ఆసుపత్రుల బిల్లులు, ముందస్తు వైద్య అనుమతి అభ్యర్థనల్లో అసాధారణ ధోరణులు,

# బతుకమ్మ.. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక!

ప్రకృతి ఆరాధనకు ప్రతిరూపం.. మహిళల ఐక్యతకు నిదర్శనం

సంపాదకీయం। ప్రత్యేక వ్యాసం

**అక్టోబర్ 10 ( తొలివార్త ):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అపురూపమైన పూల పండుగ బతుకమ్మ. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ, మహిళల ఐక్యతను ప్రతిబింబించే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తరతరాలుగా కొనసాగుతున్న బతుకమ్మ సంబరాలు తెలంగాణ పల్లెల్లో పండుగ శోభను నింపడమే కాకుండా, మన సంస్కృతీ సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతున్నాయి. ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ వేడుకలు ప్రకృతితో మానవ సంబంధాన్ని చాటిచెబుతాయి. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ సంబరాలు జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిలో ఒక ప్రత్యేకమైన దృశ్యం. పల్లె నుంచి పట్టణం వరకు ఎక్కడ చూసినా బతుకమ్మ సందడి కనిపిస్తుంది.

### ప్రకృతిని పూజించే విశిష్ట సంప్రదాయం

నేటి ఆధునిక ప్రపంచంలో ప్రకృతి పరిరక్షణపై చర్చలు విస్తృతమవుతున్న నేపథ్యంలో, బతుకమ్మ పండుగ మనకు ప్రకృతితో కలిసి జీవించాలనే గొప్ప సందేశాన్ని అందిస్తోంది. స్థానికంగా లభించే పూలతో బతుకమ్మలను అలంకరించడం, చెరువులు, కుంటలతో ముడిపడిన సంప్రదాయాలను కొనసాగించడం ఈ పండుగలోని ప్రత్యేకత. అయితే పండుగ సంబరాల సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, నీటి వనరులను కలుషితం చేయకుండా చూడటం కూడా మనందరి బాధ్యత.

### మహిళల ఐక్యతకు వేదిక

బతుకమ్మ పండుగ మహిళల ఆత్మీయతకు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది. కుటుంబాలు, స్నేహితులు, గ్రామీణ మహిళలు ఒకచోట చేరి తమ ఆనందాలను పంచుకుంటారు. బతుకమ్మ పాటల్లో కుటుంబ అనుబంధాలు, సామాజిక జీవనం, ప్రకృతి అందాలు, తెలంగాణ చరిత్రకు సంబంధించిన అంశాలు ప్రతిధ్వనిస్తాయి. ఈ సంప్రదాయం మహిళల సాంస్కృతిక



భాగస్వామ్యాన్ని పెంపొందించడమే కాకుండా, భావితరాలకు మన వారసత్వాన్ని అందించే వారధిగా నిలుస్తోంది.

### సద్దుల బతుకమ్మ.. సంబరాలకు సంపూర్ణత

తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకల్లో సద్దుల బతుకమ్మ ప్రధాన ఘట్టం. ఈ రోజున మహిళలు ప్రత్యేకంగా బతుకమ్మలను తయారు చేసి, పూజలు నిర్వహించి, సామూహికంగా వేడుకల్లో పాల్గొంటారు. సంప్రదాయ నైవేద్యాలను సమర్పిస్తూ కుటుంబాల సుఖసంతోషాలు, శ్రేయస్సు కోసం ప్రార్థిస్తారు. అనంతరం స్థానిక ఆచారాల ప్రకారం బతుకమ్మలను నీటి వనరుల్లో నిమజ్జనం చేస్తారు. ఈ వేడుకలు ప్రజల మధ్య స్నేహభావాన్ని, పరస్పర సహకారాన్ని బలోపేతం చేస్తాయి.

### సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత

తెలంగాణ రాష్ట్ర అస్తిత్వం, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే పండుగగా బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు ఉంది. రాష్ట్రంలోనే కాకుండా దేశవిదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు సైతం ఈ వేడుకలను నిర్వహించడం మన సంప్రదాయాల విస్తృతిని తెలియజేస్తోంది. అయితే బతుకమ్మను కేవలం ఉత్సవంగా మాత్రమే పరిమితం చేయకుండా, దాని వెనుక ఉన్న ప్రకృతి ప్రేమ, మహిళల గౌరవం, సామాజిక ఐక్యత వంటి విలువలను ఆచరణలో పెట్టాలి. పాఠశాలలు, కళాశాలల్లో బతుకమ్మ ప్రాధాన్యతను వివరించడం, జానపద పాటలను ప్రోత్సహించడం, స్థానిక పూల వినియోగాన్ని పెంపొందించడం, చెరువుల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఈ పండుగ అసలు స్ఫూర్తిని కాపాడుకోవచ్చు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగితే తెలంగాణ సాంస్కృతిక వారసత్వం మరింత బలోపేతమవుతుంది.

### ముగింపు

బతుకమ్మ అనేది పూలతో పేర్చిన ఒక వేడుక మాత్రమే కాదు.. అది తెలంగాణ ప్రజల భావోద్వేగం, ఆడపడుచుల ఆత్మీయత, ప్రకృతి ఆరాధన, జానపద వైభవం కలగలిసిన సాంస్కృతిక ప్రతీక. ఈ అపురూపమైన వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత. సంప్రదాయాలను గౌరవిస్తూ, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, సామాజిక ఐక్యతను పెంపొందిస్తూ బతుకమ్మ పండుగను మరింత అర్థవంతంగా జరుపుకోవాలి. పూల పరిమళంలో తెలంగాణ సంస్కృతి.. బతుకమ్మ పాటలో మన ఆత్మగౌరవం.. ఆడపడుచుల ఐక్యతలో మన సమాజ బలం!



జై తెలంగాణ.. జై బతుకమ్మ!

సూరిగల రమేష్

9494185544

తొలి వార్త యాదాద్రి

భువనగిరి జిల్లా బ్యూరో

# వలిగొండలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

పూల సోయగాలతో పల్లెల్లో పండుగ శోభ

ఆటపాటలతో సందడి చేస్తున్న ఆడపడుచులు

**వలిగొండ, అక్టోబర్ 10 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పల్లెల్లో వీధివీధినా రంగురంగుల పూల సోయగాలు విరబూస్తుండగా, బతుకమ్మ పాటలు, మహిళల ఆటపాటలతో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటున్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ కోలాహలంగా సంబరాలు జరుపుకుంటున్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతూ తమ ఆనందాన్ని పంచుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో పండుగ శోభ మరింత పెరిగింది. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానానికి, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చడం, వాటిని పూజించడం ద్వారా ప్రకృతి అందాలను గౌరవించడంతో పాటు పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప అవకాశం లభిస్తోంది. ఈ పండుగ మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను



పెంపొందించడంతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజల మధ్య స్నేహభావాన్ని బలపరుస్తుంది. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసిమెలిసి పండుగను జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిలోని ప్రత్యేకతను చాటిచెబుతోంది. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ, సంప్రదాయాలను కాపాడాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. వలిగొండ మండలంలో పూల సోయగాలు, బతుకమ్మ పాటలతో పల్లెలన్నీ పండుగ కళను సంతరించుకున్నాయి.

# చౌటుప్పల్ 20వ వార్డు రోడ్ నెం.7 లో పూల జాతర

ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన సంబురాలు

కాలనీ మహిళలు,చిన్నారుల కోలాహలం

ఆటపాటలతో అంబరాన్ని తాకిన ఉత్సాహం

**చౌటుప్పల్, అక్టోబర్ 10 ( తొలివార్త ):** తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సంబురాలు చౌటుప్పల్ మున్సిపాలిటీలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.ఇందులో భాగంగా 20వ వార్డు రోడ్ నెంబర్ 7 లో ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాలు కన్నుల పండుగగా సాగాయి.

### పూలతో గుట్టలుగా బతుకమ్మలు:

ఉదయం నుంచే కాలనీ మహిళలు తంగేడు, గునుగు,బంతి,చామంతి, గుమ్మడి పూలను సేకరించి,గుమ్మడి ఆకులపై 5 అంతరాల్లో రంగురంగుల బతుకమ్మలను పేర్చారు.సాయంత్రం 5:00 గంటలు కాగానే రోడ్ నెం.7లోని ప్రధాన కూడలిలో మహిళలు,చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో వలయంగా చేరారు.చిన్నారులు లంగా ఓణీలు,మహిళలు పట్టు చీరల్లో ముస్తాబై బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు.చిన్నారుల నృత్యాలు,మహిళల పాటలు



కాలనీ వాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

### కాలనీలో పండుగ వాతావరణం:

ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన ఈ సంబురాలతో రోడ్ నెం.7 కాలనీ అంతా పండుగ వాతావరణం నెలకొంది.తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ ఇదే ఉత్సాహంతో బతుకమ్మ వేడుకలు జరుపుకుంటామని కాలనీ మహిళలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు యువతీ యువకులు,చిన్నారులు,మహిళలు భారీ



సంఖ్యలో పాల్గొన్నారు.

# దామగట్ల సుంకుల పరమేశ్వరి ఆలయంలో చోరీ

అమ్మవారి వెండి కిరీటం, పాదాలు అపహరణ.. పోలీసులకు ఫిర్యాదు

**నందికొట్కూర్ అక్టోబర్ 10 ( తొలివార్త ):** నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామంలోని శ్రీ సుంకుల పరమేశ్వరి దేవి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి



పాల్పడ్డారు. అమ్మవారికి సంబంధించిన సుమారు 20 తులాల వెండి కిరీటం, 50 తులాల వెండి పాదాలను అపహరించారు. ఈ ఘటనతో గ్రామంలో కలకలం రేగింది.



### శనివారం ఉదయం వెలుగులోకి వచ్చిన ఘటన

ఆలయంలో పూజలు నిర్వహించే అనకాపల్లి మధుసూధాకర్, ఆయన భార్య అనకాపల్లి భారతి మంగళవారం పూజలు నిర్వహించిన అనంతరం శనివారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వచ్చారు. ఈ క్రమంలో ఆలయ తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపల పరిశీలించగా అమ్మవారి వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో విషయాన్ని అనకాపల్లి భారతి తన భర్తకు తెలియజేశారు.

అనంతరం గ్రామ ప్రజలతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### కేసు నమోదు చేసి దర్యాప్తు

సమాచారం అందుకున్న బ్రాహ్మణకొట్కూరు ఎస్సై వి. మణికంఠ ఆలయాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు. గ్రామంలోని ఆలయంలో చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
www.tolivaartha.com
తెలుగు దిన పత్రిక
www.epaper.tolivaartha.com



# తిరుమల అలిపిరి మార్గంలో చిరుతల సంచారం

**భక్తుల భద్రతకు టీటీడీ, అటవీ శాఖ ప్రత్యేక చర్యలు**

ప్రస్తుతం వన్యప్రాణుల సంతానోత్పత్తి సమయం కావడంతో అలిపిరి నడకమార్గంలో చిరుతల సంచారం ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో కాలిబాటన తిరుమల చేరే భక్తుల భద్రతపై టీటీడీ, అటవీశాఖలు దృష్టి సారించాయి.ఇది వన్యప్రాణుల సంతానోత్పత్తి కాలం కావడంతో, అలిపిరి మార్గంలో అధిక సంఖ్యలో చిరుతలు సంచరిస్తున్నాయి. గాలిగోపురం (ఏడోమైలు) నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు చిరుతల సంచారం ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పదిరోజుల కిందట ఇతర ప్రదేశాల్లోనూ జంతువుల కదలికలు కనిపించాయి. ఈ నేపథ్యంలో నడక మార్గంలో తిరుమల కొండకు చేరుకునే భక్తుల భద్రతపై టీటీడీ, అటవీ శాఖ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. భక్తులకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా రక్షణ చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్తగా నడకదారికి ఎడమవైపున 25 మీటర్ల మేర పొదలు, గడ్డి ఇతర వ్యర్థాలను తొలగించారు.నడక మార్గంలో 3 గంటల వరకే :



జంతువుల రాక దూరం నుంచే స్పష్టంగా కనిపించేలా వ్యూలైన్ ను సుమారు రెండు కి.మీ. పొడవునా క్లియర్ చేశారు. మరోవైపు వన్యప్రాణులను దారి మళ్లించేందుకు టీటీడీ రోబో డాగ్‌ను రంగంలోకి దించింది. ఇది అడవిలో సుమారు 2 కిలోమీటర్ల లోపలికి వెళ్లి జంతువుల కదలికలను పసిగట్టి పెద్దగా శబ్దం చేస్తుంది. దీంతో జంతువులు భయపడి ఫుట్‌పాత్ వైపు రాకుండా వెనక్కి వెళ్లిపోతాయని అధికారులు చెబుతున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పదేళ్లలోపు చిన్నపిల్లలను మధ్యాహ్నం 3 గంటల వరకే నడక మార్గంలో అనుమతిస్తున్నారు.గుంపులుగా కొండపైకి : పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా వదలొద్దని తల్లిదండ్రులకు మైకుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. పగటిపూట సైతం భక్తులను గుంపులుగా కొండపైకి పంపుతున్నారు. వీరికి రక్షణగా టీటీడీ, అటవీశాఖ భద్రతా సిబ్బంది ఉంటున్నారు. సాధారణంగా రాత్రి 9 గంటల తర్వాత నడకదారిలో భక్తులను అనుమతించరు. చిరుతల సంచారం దృష్ట్యా సాయంత్రం ఆరు గంటలకల్లా నడక మార్గాన్ని మూసివేయాలని అటవీశాఖ టీటీడీకి ప్రతిపాదనలు పంపింది. శ్రీవారి దర్శనానికి రోజూ వేలమంది భక్తులు వస్తుంటారు. కొందరు భక్తులు బస్సుల్లో, సొంత వాహనాల్లో, ప్రైవేట్ బస్సుల్లో తిరుమలకు వస్తుంటారు. కొందరు భక్తులు అలిపిరి, శ్రీవారి మెట్టు నడకమార్గాల్లో తిరుమలకు చేరుకుంటారు.

# ఇంద్రకీలాద్రి దసరా మహోత్సవాలు దర్శన టికెట్లు, పార్కింగ్ పూర్తి వివరాలు

దేవీ నవరాత్రులు ఆదివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన బుకింగ్స్?, పార్కింగ్ వివరాలు పాఠకుల కోసం.. ఆదివారం నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో, బెజవాడలోని ఇంద్రకీలాద్రి కొండను అందంగా అలంకరించారు. ఆ వెలుగుల మధ్య దుర్గమ్మ ఆలయం ఆకర్షణీయంగా దర్శనమిస్తోంది. దసరా ఉత్సవాల సందర్భంగా ఈ నెల 11, 12,13 తేదీలకు సంబంధించిన 'జగన్మాత దివ్య దర్శనం' టిక్కెట్లు (ధర రూ.1,000) దేవాదాయ శాఖకు చెందిన 'మన మిత్ర' వాట్సాప్ యాప్ ద్వారా అందుబాటులో ఉన్నాయని దుర్గా ఆలయ కార్యనిర్వహణాధికారి సీనా నాయక్ ప్రకటించారు.శుక్రవారం రోజు ఇంద్రకీలాద్రిపై ఉన్న తన కార్యాలయంలో వేద కమిటీ సభ్యుడు శ్రీధర్ శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమాదేవితో కలిసి ఈ టిక్కెట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాన్య భక్తులు ఎటువంటి సిఫార్సులు లేకుండానే 'మన మిత్ర' వాట్సాప్ నంబర్ 95523 00009కు సందేశం పంపడం ద్వారా నేరుగా 'జగన్మాత దివ్య దర్శనం' టిక్కెట్లను పొందవచ్చని తెలిపారు. ప్రోటోకాల్ ప్రముఖుల కోసం ఉదయం 6:00 నుంచి 8:00 గంటల వరకు, రాత్రి 7:45 గంటల తర్వాత ప్రత్యేక సమయ కేటాయింపులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ఇబ్బందులు కలుగకుండా పార్కింగ్ స్థలాల ఏర్పాటు : ఈ టిక్కెట్లు పొందిన భక్తులను కుమ్మరిపాలెం సెంటర్‌లోని టీటీడీ స్థలం నుంచి ఇంద్రకీలాద్రిపై ఉన్న 'ఓం టర్న్ పాయింట్ వరకు ఆలయ వాహనాల్లో తరలిస్తామని ఆయన వివరించారు. దర్శనం పూర్తయిన తర్వాత, భక్తులు మల్లేశ్వర స్వామి ఆలయ మెట్ల మార్గం గుండా కనకదుర్గ నగర్‌కు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.దసరా ఉత్సవాలు, సరస్, విజయవాడ ఉత్సవాల కోసం నగరానికి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు రానున్నారు. ఇందుకోసం వాహనాలను పార్కింగ్ చేసేందుకు వీలుగా పోలీసులు పలు ప్రాంతాలను గుర్తించారు. ఈసారి ఎక్కువ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సంఖ్యను పెంచారు. నగరంలోకి వాహనాలు ప్రవేశించే మార్గాలను అనుగుణంగా పార్కింగ్ ప్రదేశాలను నిర్ణయించారు.ప్రత్యేక యాప్ ద్వారా పార్కింగ్ సెంటర్లలో ఎక్కడ ఖాళీ ఉందో తెలుసుకోవచ్చని పోలీసులు చెబుతున్నారు . విజయవాడ వాసులు దేవస్థానం వైపు రావాలంటే ర్యాంప్, గణేశ్ నిమజ్జన ప్రాంతం, కాళేశ్వరరావు రైతు బజార్, రైల్వే వెస్ట్ బుక్కింగ్ (తారాపేట), గాంధీ మున్సిపల్ హైస్కూల్, గద్ద బొమ్మ సమీపంలో, తుమ్మలపల్లి కళాక్షేత్రం, పాత ప్రభుత్వాసుపత్రి రోడ్డు, రైతుబజార్ కాలవ రోడ్డు, ఈ3 ఫుడ్ కోర్ట్ వద్ద (ఆర్టీసీ ఇన్‌గేట్ ఎదురు), కనకదుర్గ పైవంతెన ప్రవేశం వద్ద, బొడ్డురాయి సెంటర్‌తెలంగాణ, హైదరాబాద్, గుంటూరు నుంచి కాజ టోల్ ప్లాజా – నల్లకుంట మీదుగా వచ్చే వారు, పున్నమి ఘాట్‌లోని సరస్‌కు వచ్చే వారు, నగర వాసులు హెడ్ వాటర్ వర్క్స్, లోటస్ ఎదురుగా ప్రైవేటు నిర్మాణ స్థలం, బెర్మ్ పార్క్, భవానీ ఐలాండ్, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బబ్బూరి గ్రౌండ్స్, అన్నా కల్యాణమండపం, స్వర్ణ 40 లారీ స్టాండ్ ప్రాంతం (భవానీపురం), షాదీఖానా, సోమా గ్రౌండ్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు, ఆర్టీసీ ఆసుపత్రి స్థలం, వేగా ప్రైవేటు స్థలం, విజయవాడ ఉత్సవ్, వెంకటేశ్వర ఫౌండ్రీ, టీటీడీ మైదానం, కనకదుర్గ పైవంతెన ప్రవేశం, స్వాతి సెంటర్ వద్ద, పున్నమి ఘాట్, సీవీ కన్వెన్షన్. వద్ద వాహనాలను పార్కింగ్ చేసుకోవచ్చు.శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఏలూరు, మచిలీపట్నం, గుంటూరు (వారధి మీదుగా) నుంచి వచ్చే కార్లు, బస్సులు, విజయవాడ నగరవాసులు పడవలరేవు నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు, ఎఫ్‌సీఐ గోదాము, మధురానగర్ నుంచి ఫుడ్ జంక్షన్, ఆంజనేయస్వామి ఆలయం, శారదా కళాశాల, సీతన్నపేట గేట్ కూడలి వరకు, రైల్వే క్వార్టర్స్ రోడ్డు (సత్యనారాయణపురం), జింఖానా మైదానం, సంగీత కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్కింగ్ స్థలాల్లో వాహనాలను పార్క్ చేయవచ్చు.మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరగనున్న విజయవాడ ఉత్సవ్ కోసం వచ్చే వారు డిస్నీల్యాండ్ పార్కింగ్, ఎక్సెల్ రోడ్డు వద్ద పార్కింగ్ స్థలాల్లో వాహనాలను పార్క్ చేయవచ్చని ట్రాఫిక్



పోలీసులు తెలిపారు. ముఖ్యగమనిక: అన్ని ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లు, కీలక ప్రాంతాల వద్ద క్యూఆర్ కోడ్‌లను ప్రదర్శించనున్నారు. వీటిని స్కాన్ చేయడం ద్వారా వాహనదారులు పార్కింగ్ ప్రాంతాలను యాక్సెస్ చేసుకోవచ్చు. దీని ద్వారా పార్కింగ్ ప్రదేశం లొకేషన్‌ను గుర్తించి అక్కడ వాహనాన్ని నిలుపుకోవచ్చు. దీని వల్ల ఈ స్థలాల కోసం వెతుకుతూ సమయం వృథా కాకుండా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉంటాయి. అన్ని చోట్లా ఏఎన్‌పీఆర్ (ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్) కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా వాహనాల రాకపోకలను పర్యవేక్షిస్తారు.పౌరుల వినియోగం కోసం తీసుకొచ్చిన అస్త్రం యాప్‌ను ఉపయోగించి పార్కింగ్ స్థలాల్లోని పరిస్థితిని తెలుసుకోవచ్చు. పార్కింగ్ చేసేందుకు వీలు ఉందా లేదా అనే విషయాన్ని కూడా తెలుసుకోవచ్చు. తదితర అంశాలను ఈ యాప్‌ను ఉపయోగించి తెలుసుకోవచ్చు.శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మూలా నక్షత్రం రోజు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. 16న దాదాపు 2.50 లక్షల నుంచి 3 లక్షల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నారు.భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసులు ఆంక్షలు అమలు చేయనున్నారు. కుమ్మరిపాలెం, లాడ్జి అవుట్‌పోస్ట్, కనకదుర్గ పైవంతెన ప్రవేశ ప్రాంతం, గద్ద బొమ్మ సెంటర్, పోలీసు కంట్రోల్ రూమ్ కూడలి పరిసరాల్లో వాహనాలను అనుమతించరు.

# ఏపీ పింఛన్‌దారులకు బిగ్ అలర్ట్ నవంబర్ 1 నుంచి కొత్త విధానం

పింఛన్ల పంపిణీ పథకంలో నవంబర్ ఒకటో తేదీ నుంచి కొత్త విధానం అమల్లోకి రానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాలను వేర్వేరుగా లబ్ధిదారులకు అందించనున్నాయి. పింఛన్ల పంపిణీ పథకంలో నవంబర్ ఒకటో తేదీ నుంచి కొత్త విధానం అమల్లోకి రానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాలను వేర్వేరుగా లబ్ధిదారులకు అందించనున్నాయి. అయితే ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటాను లబ్ధిదారులకు నేరుగా తమ ఇళ్లవద్దే నగదు రూపంలో స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయల సిబ్బందితో అందించనుండగా, కేంద్ర ప్రభుత్వం వాటాను మాత్రం లబ్ధిదారుల ఖాతాల్లో డీబీటీ (డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్) విధానంలో నేరుగా జమ చేయనున్నారు.నేరుగా నగదు రూపంలో : ఈ విధానంతో వృద్ధులు, ఒంటరి మహిళలకు అందే రూ.4 వేలలో కేంద్రం వాటా రూ.200 బ్యాంకు ఖాతాలో జమ కాగా, మిగిలిన రూ.3,800 నగదు రూపంలో సచివాలయ సిబ్బంది అందిస్తారు. దివ్యాంగులకు అందించే రూ.6వేలలో కేంద్రం వాటా రూ.300 లబ్ధిదారుల బ్యాంకు



ఖాతాలో జమ కానుండగా, మిగిలిన రూ.5700 నేరుగా నగదు రూపంలో అందించనున్నట్లు ప్రకటించారు.ఆధార్ నంబర్ ద్వారా : కొత్త విధానంలో కేంద్ర ప్రభుత్వ వాటా పొందాలంటే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరని అధికారులు సూచిస్తున్నారు. ఆధార్ కేవైసీ చేసుకోవాలని సూచిస్తున్నారు. తమ ఖాతాలకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) తప్పనిసరిగా పూర్తయి ఉండాలంటున్నారు. జాతీయ స్థాయిలో ఆధార్ నంబర్ ద్వారా ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు బదిలీ సులభతరం అవుతుందన్నారు.నగదు జమకాక ఇబ్బందులు : చాలా మంది పలు ప్రైవేట్, చిన్న మొత్తాల బ్యాంకులకు సంబంధించి ఖాతాలను, డిజిటల్ ఖాతాలను తెరుస్తున్నారు. దీంతో వారు చివరిగా ప్రారంభించిన ఖాతాలకు, పాస్ పుస్తకాలు లేని డిజిటల్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కావడంతో నగదు జమకాక ఇబ్బందులకు గురవుతున్నారు.ఎన్ని బ్యాంకు ఖాతాలున్నా : తమ ఆధార్ అనుసంధానం ఎన్‌పీసీఐ లింక్‌ను సరిచూసుకొని ఖాతాలను వినియోగించుకోవడం ద్వారా ఇబ్బందులకు చెక్ పెట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. వినియోగదారుడికి ఎన్ని బ్యాంకు ఖాతాలున్నా ఎన్‌పీసీఐ లింక్ ఒక ఖాతాకే ఉంటుంది. వినియోగదారులు నేరుగా ఊఊఊ.అజూఏఆ.శీతీస్త్ర.ఆఆ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి మార్పులు చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

# మారనున్న గచ్చిబౌలి ఫేస్ ఏడాదిలోగా అందుబాటులోకి 2 డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు!

గచ్చిబౌలి కూడలిలో 3 ఫ్లై ఓవర్లు నిర్మాణం అవుతుండగా, అందులో 2 డబుల్ డెక్కర్ పైవంతెనలు ఉన్నాయి. దీంతోపాటు ఓ అండర్‌పాస్ కూడా నిర్మించనున్నారు. ఏడాదిలోపు వీటిని అందుబాటులోకి తెచ్చేలా అధికారులు పనిచేస్తున్నారు. గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ జంక్షన్ పలు రికార్డులకు నిలయంగా మారింది. నగరంలో మొదటిసారిగా ఓ చౌరాస్తాలో మూడు ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటితో పాటు త్వరలో ఓ అండర్‌పాస్ కూడా రానుంది. ఇక్కడి పైవంతెనల్లో రెండు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు కావడం విశేషం.మొత్తంగా గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ కూడలిలో భూతల, భూగర్భంతో పాటు రెండు అంతస్తుల్లో రోడ్డు నెట్‌వర్క్‌లు నిర్మాణమవుతూ ప్రాజెక్ట్ పురోగతిలోనూ వేగంగా దూసుకెళ్తోంది. ఏడాదిలోగా పనులను పూర్తి చేసి, ఫ్లై ఓవర్లపై వాహనాల రాకపోకలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో సైబరాబాద్ పురపాలక సంస్థ (సీఎంసీ) కమిషనర్ జి.సృజన పని చేస్తున్నారు.



**డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లను ఇలా నిర్మిస్తున్నారు**

ఐఎస్‌బీ, డీఎల్‌ఎఫ్ రోడ్ల మధ్య టూవే రాకపోకలను సులభంగా మార్చేందుకు గానూ 720 మీటర్ల పొడవుతో నాలుగు లేన్ల ఫ్లైఓవర్‌ను నిర్మిస్తున్నారు. ఈ పైవంతెన అంచుల వెంబడి ఐదు పిల్లర్లు ఫస్ట్ లెవల్ ఫ్లైఓవర్‌తో పాటు సెకండ్ లెవల్ పైవంతెనను కూడా మోయగలిగే సామర్థ్యంతో నిర్మాణమవుతున్నాయి. వీటి మీద ఐఎస్‌బీ వైపు నుంచి గచ్చిబౌలి జంక్షన్ వైపు వెళ్లే వాహనాల రాకపోకల కోసం 1.2 కిలోమీటర్ల పొడవుతో రెండో అంతస్తులో 3 వరుసల వంతెనను నిర్మిస్తున్నారు. అలాగే డీఎల్‌ఎఫ్ రోడ్డు నుంచి లింగంపల్లి వైపు వెళ్లేందుకు 948 మీటర్ల పొడవుతో 3 లేన్ల ఫ్లైఓవర్‌ను నిర్మిస్తున్నారు. ఈ రెండు కర్వ్‌డ్ ఫ్లైఓవర్లను ఫస్ట్ లెవల్ పైవంతెనలోని పిల్లర్లను కనెక్ట్ చేస్తూ నిర్మిస్తారు.

**సిగ్నల్ ఫ్రీగా మారనుంది**

ఈ ప్రాజెక్ట్ ద్వారా రెండు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు అందుబాటులోకి వస్తున్నాయని, ఈ డిజైన్ వల్ల భూసేకరణతో పాటు నిర్మాణ ఖర్చులూ గణనీయంగా తగ్గాయని ఇంజినీర్లు చెబుతున్నారు. ఈ చౌరాస్తాలో గచ్చిబౌలి, లింగంపల్లి మధ్య వాహనాల రాకపోకలను మరింత సులభతరం చేసేలా 520 మీటర్ల పొడవున 6 లేన్ల అండర్‌పాస్‌ను కూడా నిర్మిస్తున్నారు. ఈ గచ్చిబౌలి ప్రాజెక్ట్ పూర్తయితే ఈ జంక్షన్ సిగ్నల్ ఫ్రీగా మారనుంది. ఈ అన్ని రోడ్డు మార్గాల మొత్తం పొడవు 3.39 కిలోమీటర్లు. రూ.459 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ పూర్తయితే గచ్చిబౌలి జంక్షన్ గుండా వెళ్లే వాహనాల ప్రయాణ సమయం 10 నుంచి 15 నిమిషాల వరకు తగ్గుతుంది."సైబరాబాద్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రస్తుతం రూ.2 వేల కోట్ల విలువైన రహదారి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటిలో ట్రిపుల్ ఐటీ కూడలి ప్రాజెక్ట్‌తో పాటు ఖాజాగూడ దగ్గర చేపట్టిన నిర్మాణ పనులు ప్రధానమైనవి. ట్రిపుల్ ఐటీ చౌరాస్తా దగ్గర ఫ్లైఓవర్లు పూర్తయ్యాక ఆ ప్రాంతం ఎంతో ఆకర్షణీయంగా మారుతుంది. కూడలిలో రోడ్డును 200 అడుగుల వెడల్పుకు విస్తరిస్తున్నాం. అక్కడి నుంచి ఓఆర్ఆర్ జంక్షన్ మీదుగా బయోడైవర్సిటీ చౌరాస్తా వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టాం. ఇక బయోడైవర్సిటీ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వెళ్లే రహదారి అభివృద్ధి పనులను కూడా 2027 మే నాటికి పూర్తి చేస్తాం" – జి.సృజన, సీఎంసీ కమిషనర్

**వేగంగా భూసేకరణ పనులు**

సైబరాబాద్ టౌన్ ప్లానింగ్ విభాగం ప్రాధాన్యత ప్రాతిపదికన భూసేకరణ ప్రక్రియను చకచకా పూర్తి చేస్తోంది. ట్రిపుల్ ఐటీ జంక్షన్ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇప్పటికే 98 శాతం ఆస్తులు సేకరించామని, కూల్చివేత పనులు కూడా వేగంగా సాగుతున్నాయని సీసీపీ వెంకన్న తెలిపారు. అలాగే గచ్చిబౌలి జంక్షన్ నుంచి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వరకు ఉన్న మార్గంలో 21 ఆస్తులను సేకరించారు.

# బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనుకి కీలక బాధ్యతలు అప్పగించిన చంద్రబాబు

**అరకు పార్లమెంట్ టీడీపీ పరిశీలకుడిగా చిన్న శ్రీను నియామకం**

**వైసీపీ నుంచి చేరిన నెలరోజులకే కీలక బాధ్యతలు అప్పగింత**

**పార్టీ అభివృద్ధికి నిరంతరం పాటుపడతానన్న శ్రీను**

వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)కు తెలుగుదేశం పార్టీలో కీలక బాధ్యతలు దక్కాయి. అరకు పార్లమెంట్ నియోజకవర్గానికి పార్టీ పరిశీలకుడిగా ఆయన్ను నియమిస్తూ టీడీపీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన చిన్న శ్రీనుకు నెల రోజుల్లోనే ఇంతటి ముఖ్యమైన బాధ్యతను అప్పగించడం ఉత్తరాంధ్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గిరిజన ప్రాబల్యం అధికంగా ఉన్న అరకు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీని బలోపేతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయడమే లక్ష్యంగా ఈ నియామకం జరిపినట్లు తెలుస్తోంది.ఈ నియామకంపై చిన్న శ్రీను స్పందిస్తూ... చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతోనే తాను



టీడీపీలో చేరానని తెలిపారు. అరకు ప్రాంతంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ, పార్టీ శ్రేణులతో కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని ఆయన వివరించారు.

# డ్రైవర్ శివ త్యాగం చిరస్మరణీయం: లోకేశ్ నివాళి

**గుండెపోటుతో స్టీరింగ్‌పైనే కుప్పకూలిన ఆర్టీసీ డ్రైవర్**

**ప్రాణాలు పోయేముందు బస్సును ఆపి 40 మందిని కాపాడిన వైనం**

**డ్రైవర్ శివకు సెల్యూట్ అంటూ నివాళులర్పించిన లోకేశ్**

**మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వ హామీ**



కాకినాడ జిల్లాలో ఓ ఆర్టీసీ డ్రైవర్ తన ప్రాణాలను పణంగా పెట్టి 40 మంది ప్రయాణికులను సురక్షితంగా కాపాడారు. తీవ్రమైన గుండెపోటు వస్తున్నప్పటికీ, అత్యంత సమయస్ఫూర్తితో బస్సును రోడ్డు పక్కన నిలిపి, స్టీరింగ్‌పైనే తుదిశ్వాస విడిచారు. కర్తవ్య నిర్వహణలో ఆయన చూపిన సాహసం అందరినీ కలిచివేసింది.కాకినాడ ఆర్టీసీ డిపోలో దినసరి వేతన డ్రైవర్‌గా పనిచేస్తున్న జట్ల శివ (శంఖవరం మండలం, కత్తిపూడి గ్రామం), కాకినాడ నుంచి 40 మంది ప్రయాణికులతో విశాఖపట్నం వెళ్తున్నారు. తుని సమీపంలోకి రాగానే ఆయనకు ఛాతీలో తీవ్రమైన నొప్పి మొదలైంది. ఆ సమయంలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్న బస్సును చాకచక్యంగా అదుపు చేసి, రోడ్డు పక్కన సురక్షితంగా నిలిపారు. అనంతరం స్టీరింగ్‌పైనే కుప్పకూలి మరణించారు. ప్రయాణికులు వెంటనే స్పందించి ఈ విషయాన్ని అధికారులకు తెలియజేశారు.ఈ ఘటనపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. డ్రైవర్ శివ సాహసాన్ని కొనియాడుతూ ఆయనకు సెల్యూట్ చేశారు. "40 మంది ప్రాణాలను కాపాడిన ఆపద్బాంధవుడు శివ. తన ప్రాణాపాయ స్థితిలోనూ ప్రయాణికుల క్షేమమే పరమావధిగా బస్సును నిలిపిన ఆయన త్యాగం చిరస్మరణీయం" అని లోకేశ్ పేర్కొన్నారు. శివ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసిన ఆయన, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

# దసరా పండుగ సందడి.. కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్

**దసరా సెలవులతో హైదరాబాద్ బస్టాండ్లలో పెరిగిన ప్రయాణికుల రద్దీ**

**రాష్ట్రవ్యాప్తంగా 7,000 ప్రత్యేక బస్సులను నడుపుతున్న టీజీఎస్ఆర్టీసీ**

**ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలపై 50 శాతం అదనం**

**మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం యథాతథం**

**ప్రయాణికుల కోసం ప్రధాన టెర్మినళ్లలో అదనపు సౌకర్యాల ఏర్పాటు**

దసరా పండుగ సెలవులు ప్రారంభం కావడంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. తెలంగాణలో పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో, శుక్రవారం సాయంత్రం నుంచే సొంతూళ్లకు వెళ్లేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. నగరంలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. కుటుంబ సభ్యులు, విద్యార్థులతో బస్టాండ్ల ప్రాంగణాలన్నీ సందడిగా మారాయి.పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం అక్టోబర్ 18వ తేదీ వరకు మొత్తం 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక సర్వీసుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్ నుంచి 3,533 బస్సులు నడుస్తుండగా, హైదరాబాద్ జోన్ నుంచి 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 బస్సులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీ నగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల నుంచి కూడా ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తున్నాయి.అయితే, ఈ ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఛార్జీలను 1.5 రెట్లు (50 శాతం అదనంగా) పెంచినట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే అక్టోబర్ 9, 10, 16, 17 తేదీలతో పాటు, తిరుగు ప్రయాణ రద్దీ ఉండే అక్టోబర్ 25, 26 తేదీల్లో ఈ పెంచిన ఛార్జీలు వర్తిస్తాయి. సాధారణ బస్సు సర్వీసుల్లో ఛార్జీలలో ఎలాంటి మార్పు లేదని, 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్టాండ్లలో తాత్కాలిక షెల్టర్లు, తాగునీటి సౌకర్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, మొబైల్ టాయిలెట్లను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. సెలవుల అనంతరం తిరుగు ప్రయాణ రద్దీని కూడా దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో అవసరాన్ని బట్టి అదనపు బస్సులను నడుపుతామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రూ.100 కోట్ల ఆస్తులు.. అసిస్టెంట్ మేనేజర్ అవినీతి బాగోతం బట్టబయలు

**మహబూబాబాద్ పౌరసరఫరాల శాఖ అధికారి ఇళ్లపై ఏసీబీ దాడులు**

**అసిస్టెంట్ మేనేజర్ నరసింహారావు అక్రమాస్తుల గుర్తింపు**

**మార్కెట్ విలువ ప్రకారం రూ.100 కోట్లకు పైగా ఆస్తులు**

**రికార్డుల్లో రూ.9.41 కోట్లుగా చూపిన అధికారులు**

**బినామీల పేర్లతో భారీగా భూములు, భవనాలు, రైస్ మిల్లు**



పౌరసరఫరాల శాఖలో ఓ అవినీతి తిమింగలం ఏసీబీ అధికారులకు చిక్కింది. అసిస్టెంట్ మేనేజర్ స్థాయిలో ఉండి, జిల్లా ఇన్‌చార్జి మేనేజర్‌గా పనిచేస్తున్న ఓ అధికారి ఏకంగా రూ.100 కోట్ల విలువైన అక్రమాస్తులు కూడబెట్టడం సంచలనం సృష్టిస్తోంది. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలతో ఏసీబీ అధికారులు శుక్రవారం ఏకకాలంలో ఏడు చోట్ల దాడులు నిర్వహించి భారీగా ఆస్తులను గుర్తించారు. మహబూబాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జి మేనేజర్‌గా పనిచేస్తున్న వాసంశెట్టి నరసింహారావు నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, బినామీల ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఈ దాడుల్లో గుర్తించిన ఆస్తుల మార్కెట్ విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే, ప్రభుత్వ రికార్డుల ప్రకారం వీటి డాక్యుమెంట్ విలువ రూ.9.41 కోట్లుగా ఉందని ఏసీబీ డీజీ చారుసిన్హా తెలిపారు.నరసింహారావు, ఆయన బంధువులు, బినామీల పేర్ల మీద ఖమ్మం, హైదరాబాద్‌లలో బహుళ అంతస్తుల భవనాలు, ఖాళీ స్థలాలు ఉన్నట్టు గుర్తించారు. సూర్యాపేట, నిజామాబాద్ జిల్లాల్లో వందల ఎకరాల వ్యవసాయ భూములను కొనుగోలు చేసినట్టు ఆధారాలు లభించాయి. నిజామాబాద్ జిల్లా సిరికొండలో రూ.76 లక్షల డాక్యుమెంట్ విలువ ఉన్న భూమికి, అగ్రిమెంట్‌లో ఏకంగా రూ.6.54 కోట్లుగా చూపడం గమనార్హం.నరసింహారావు ఇంట్లో 360 గ్రాముల బంగారం, 331 గ్రాముల వెండి, రూ.20 లక్షల విలువైన మూడు వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఖరీదైన గృహోపకరణాలు, ఖరీదైన మద్యం బాటిళ్లు కూడా లభించాయి. 2011లో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన ఈయన, ఇంత తక్కువ కాలంలో ఈ స్థాయిలో ఆస్తులు కూడబెట్టడంపై అధికారులు విచారణ జరుపుతున్నారు. బినామీ పేరుతో ఓ రైస్ మిల్లు నడుపుతున్నట్టు అనుమానిస్తున్నామని, బ్యాంకు లాకర్లు, ఇతర వ్యాపార లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# తెలంగాణ ఆడపడుచులకు సీఎం రేవంత్ బతుకమ్మ శుభాకాంక్షలు



తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా రాష్ట్ర మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ తొమ్మిది రోజుల పూల ఉత్సవాలను మహిళలందరూ ఆనందోత్సాహాల మధ్య, సంప్రదాయ పాటలు, నృత్యాలతో ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక సందేశాన్ని విడుదల చేశారు.బతుకమ్మ పండుగ తెలంగాణ విశిష్ట సంస్కృతికి అద్దం పడుతుందని, ప్రకృతిని ఆరాధించే అత్యంత గొప్ప సంప్రదాయమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి, గౌరమ్మను పూజించడం తెలంగాణ జీవన విధానంలో ఒక భాగమని ఆయన పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మ వరకు సాగే ఈ వేడుకలు ప్రజల మధ్య ఐక్యతను, సామూహిక జీవన సౌందర్యాన్ని చాటిచెబుతాయని ఆయన కొనియాడారు.బతుకమ్మ పండుగ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తమ ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ పండుగ నేడు తెలంగాణ ప్రజల జీవనశైలిలో ఒక అంతర్భాగంగా మారిపోయిందని ఆయన పేర్కొన్నారు.

## పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేస్తున్నారా.. ఇకపై ఈ కొత్త ఫారం గురించి తప్పనిసరిగా తెలుసుకోవాల్సిందే

ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ పీఎఫ్ చందాదారులకు ఒక అత్యంత కీలకమైన, ప్రయోజనాకరమైన మార్పును తీసుకువచ్చింది. 2026-27 పన్ను సంవత్సరం నుండి పీఎఫ్ ఉపసంహరణలపై మూలం వద్ద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేయడానికి ఇప్పటివరకు వాడుకలో ఉన్న ఫారం 15 (15+), ఫారం 15హెచ్ ( 15ఎ) లు ఇకపై చెల్లవని ఈపీఎఫ్ఓ స్పష్టం చేసింది. నూతనంగా అమలవుతున్న ఆదాయపు పన్ను చట్టం ప్రకారం.. పీఎఫ్ విత్‌డ్రా చేసుకునే సమయంలో టీడీఎస్ మినహాయింపును పొందడానికి చందాదారులు ఇకపై తప్పనిసరిగా ఫారం 121 (121) ను మాత్రమే సమర్పించాల్సి ఉంటుందని అధికారిక ప్రకటన వెలువడింది. సోషల్ మీడియా వేదిక ' ద్వారా ఈపీఎఫ్ఓ ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ.. పన్ను చెల్లింపుదారులు ఈ కొత్త విధానానికి అనుగుణంగా మారాలని సూచించింది. కింగ్ స్టబ్ ఐ కసివ అడ్వకేట్స్ అటార్నీస్ భాగస్వామి అయిన ఆదిత్య భట్టాచార్య ఈ మార్పుపై వివరణ ఇస్తూ.. గతంలో నివాస పన్ను చెల్లింపుదారులు తమ వయస్సు, అర్హతను బట్టి ఫారం 15 (60 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉండి, మొత్తం ఆదాయం పన్ను మినహాయింపు పరిమితి కంటే తక్కువగా ఉన్నవారు) లేదా ఫారం 15హెచ్ (60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న సీనియర్ సిటిజన్లు) ఫారమ్‌లను ఎంచుకునేవారని తెలిపారు. కానీ 2026-27 పన్ను సంవత్సరం నుంచి ఈ రెండు ఫారమ్‌ల రద్దుతో, పీఎఫ్ సభ్యులు ఈ పురాతన విధానానికి బదులు కొత్త ఫారం 121 నిబంధనను పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఖాతాదారులకు బిగ్ అలర్ట్.. ఈ పొరపాటు చేస్తే మీ ఖాతాలో నిధులు పోయినట్లే.. ఏమి మారింది ఈ కొత్త ఫారం ప్రత్యేకత ఏమిటి ఈ మార్పు కేవలం ఒక విధానపరమైన సరళీకరణ మాత్రమేనని.. కొత్త పన్నులని ఏమీ ప్రవేశపెట్టలేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఏప్రిల్ 1, 2026 నుండి అమల్లోకి వచ్చిన ఆదాయపు పన్ను చట్టం ప్రకారం, అర్హత కలిగిన నివాస పన్ను చెల్లింపుదారులు తమ ఆ సంవత్సరపు మొత్తం పన్ను బాధ్యత సున్నాగా ఉంటుందని భావిస్తే.. సెక్షన్ కింద ఏకీకృత ప్రకటనను సమర్పించడానికి ఈ ఫారం 121 అనుమతిస్తుంది.




అయితే ఈ ఫారం సమర్పించినంత మాత్రాన పీఎఫ్ ఉపసంహరణ స్వయంచాలకంగా పూర్తిగా పన్ను రహితం అయిపోదని, ఇది కేవలం పన్ను పరిధిలోకి రాని అర్హత గల వ్యక్తులు టీడీఎస్ కోత నుండి మినహాయింపు కోరడానికి మాత్రమే ఉపయోగపడుతుందని ఆదిత్య భట్టాచార్య స్పష్టం చేశారు. ఈ విధానం పూర్తిగా ఐచ్ఛికమైనది అయినప్పటికీ, సభ్యులు దీనిని సమర్పించే ముందు కొన్ని కీలక నిబంధనలను పాటించాలి: 1. పీఎఫ్ ఖాతాకు చెల్లుబాటు అయ్యే పాన్ కార్డ్ అనుసంధానించబడి ఉండటం తప్పనిసరి. పాన్ లేకుండా సమర్పించే ఏ డిక్లరేషన్ అయినా చెల్లదుగా పరిగణించబడుతుంది. 2. ఈ సదుపాయం నివాసితులు కాని వారికి లేదా వాస్తవంగా పన్ను చెల్లించాల్సిన వ్యక్తులకు వర్తించదు. ఈపీఎఫ్ఓ ఆన్‌లైన్ వ్యవస్థ,ప్రత్యేక సంఖ్య ఈ కొత్త విధానాన్ని మరింత పారదర్శకంగా.. కచ్చితంగా మార్చేందుకు ఈపీఎఫ్ఓ తన అన్ని ప్రాంతీయ కార్యాలయాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన ప్రతి ఫారం 121కి ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయబడుతుంది. అలాగే డిజిటల్ లేదా ఇ-సంతకం ద్వారా ఆన్‌లైన్‌లోనే ఈ ఫారమ్‌ను సమర్పించే వెసులుబాటును కల్పించారు. పీఎఫ్ ఖాతా నుంచి అత్యవసరంగా నిధులను ఉపసంహరించుకోవాలని యోచిస్తున్న సభ్యులు, పాత పద్ధతిలో టీడీఎస్ కట్ అయిన తర్వాత తిరిగి రీఫండ్ కోసం సుదీర్ఘకాలం వేచి ఉండే బదులు.. ఇకపై మొదటి నుండే ఈ నూతన 'ఫారం 121' నిబంధనను ఉపయోగించుకుని టీడీఎస్ మినహాయింపును క్లెయిమ్ చేసుకోవడం సులభతరమని పన్ను నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. సభ్యులు దరఖాస్తు చేసే ముందే తమ అర్హతలను, పాన్ వివరాలను సరిచూసుకోవడం ఎంతో ముఖ్యం.

# అత్యవసర నిధిని ఎక్కడ పెట్టుబడి పెట్టాలి..!

జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించ లేరు. అందుకే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తారు. అలాగే వైద్య ఖర్చులు తగ్గించుకోవడానికి హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని చెబుతుంటారు. టర్మ్, హెల్త్ తప్పనిసరిగా తీసుకోవాల్సిన పాలసీలు. అయితే జీవితంలో అప్పుడప్పుడు ఊహించిన పరిణామాలు జరుగుతాయి. అప్పుడు భారీగా డబ్బు అవసరమయ్యే అవకాశం ఉంటుంది. అత్యవసరంగా డబ్బులు కావాల్సి వస్తుంది. దాని కోసం అత్యవసర ఫండ్ ఉంచుకోవాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. సంక్షోభ సమయంలో తక్షణ ఆర్థిక సహాయం అందించడమే అత్యవసర నిధి ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొంటున్నారు. వైద్య ఖర్చులు, ప్రమాదాలు, ఉద్యోగం కోల్పోవడం లేదా ఇతర ఆర్థిక అత్యవసర పరిస్థితుల వంటి ఊహించని ఖర్చులు వచ్చినప్పుడు ఈ నిధి తక్షణమే అందుబాటులో ఉండాలి. ఆ విధంగా ఎమర్జెన్సీ ఫండ్ ను పార్క్ చేయాల్సి ఉంటుంది. అత్యవసర నిధిని ఏర్పాటు చేయడానికి జాగ్రత్తగా ప్రణాళిక వేసుకోవాలని చెబుతున్నారు. ముఖ్యంగా ద్రవ్య లభ్యత, మూలధన భద్రత(పెట్టుబడి పెట్టిన సొమ్ము). సహేతుకమైన రాబడులను సమతుల్యం చేసుకోవాలి. అత్యవసర నిధి కోసం రూ.5 లక్షల వరకు ఉంటే సరిపోతుదని సూచిస్తున్నారు. అయితే రూ.5 లక్షలను ఎక్కడా పెట్టుబడి పెడితే సొమ్మును వెంటనే ఉపసంహరించుకునేలా చూసుకోవాలి. స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లలో సిప్ ఆపి.. లార్జ్ క్యాప్ ఫండ్లలో స్టార్ట్ చేయాలా..! ఇందుకోసం పొదుపు ఖాతాలు, బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు లిక్విడ్ మ్యూచువల్ ఫండ్‌లు పరిశీలించాలి. ఇవి వేర్వేరు ప్రయోజనాలను అందిస్తాయి. బ్యాంకు పొదుపు ఖాతాల కంటే బ్యాంకు ఖీణలు అధిక రాబడులను అందించగలవు. ఉదాహరణకు అనేక ప్రముఖ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు సీనియర్ సిటిజన్లకు ఎంపిక చేసిన కాలపరిమితులపై 8 శఆతం కంటే ఎక్కువ వడ్డీ రేట్లను అందిస్తున్నాయి. మరోవైపు లిక్విడ్ మ్యూచువల్ ఫండ్‌లు ప్రధానంగా స్వల్పకాలిక డెట్, మనీ మార్కెట్ సాధనాలలో పెట్టుబడి పెడతాయి, అందువల్ల ఇవి సాపేక్షంగా తక్కువ-నష్టభయం గల పెట్టుబడి




ఎంపికలుగా ఉన్నాయి అయినప్పటికీ అవి పూర్తిగా నష్టభయం లేనివి కావు. రాబడులు హెచ్చుతగ్గులకు లోనవుతాయి. ఒక అత్యవసర నిధి రాబడుల కంటే ద్రవ్యత, మూలధన భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు రూ.5 లక్షల నిధిలో తక్షణ అవసరాల కోసం పొదుపు ఖాతాలో రూ.1 లక్ష, కచ్చితమైన రాబడుల కోసం ఎఫ్‌డీలో రూ.2 లక్షలు, సులభంగా డబ్బు తీసుకోవడానికి, అధిక రాబడినిచ్చే సామర్థ్యం కోసం లిక్విడ్ ఫండ్‌లో రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టొచ్చు. అయితే ఈ కేటాయింపు మీ నెలవారీ ఖర్చులు, ఆదాయ స్థిరత్వంపై ఆధారపడి ఉండాలి. అదే సమయంలో అవసరమైనప్పుడు మీరు డబ్బును తీసుకునేలా ఉండాలి. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ఇకపై అమెరికన్లనే ఉద్యోగాల్లో నియమించుకుంటాం

### గ్రీన్ కార్డ్ నిలిపివేత వివాదంపై టీసీఎస్ సంచలన ప్రకటన..

హెచ్-1బి (-1డీ) వీసా ఉద్యోగులకు గ్రీన్ కార్డ్ స్పాన్సర్‌షిప్‌ను అందించే శాశ్వత కార్మిక ధృవీకరణ కార్యక్రమం నుండి పలు ప్రధాన ఐటీ సంస్థలను సస్పెండ్ చేస్తూ అమెరికా ప్రభుత్వం తీసుకున్న తీవ్ర నిర్ణయంపై భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అధికారికంగా స్పందించింది. అమెరికా ప్రభుత్వం విధించిన ఈ తాత్కాలిక నిషేధ ప్రకటనను తాము గమనించామని.. యూఎస్ కార్మిక శాఖ ఇచ్చే ప్రతీ ఆదేశానికి, నిబంధనకు టీసీఎస్ సంపూర్ణంగా కట్టుబడి ఉంటుందని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కంపెనీ స్పష్టం చేసింది. వ్యవస్థను దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలు గ్లోబల్ టెక్ పరిశ్రమలో తీవ్ర దుమారం రేపిన నేపథ్యంలో టీసీఎస్ ఈ వివరణ ఇచ్చింది. అమెరికాలో తమ శ్రామిక శక్తి వ్యూహం, కార్యకలాపాలు ఎల్లప్పుడూ స్థానిక ప్రాతిపదికన, పటిష్టమైన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ఆధారంగానే సాగుతున్నాయని టీసీఎస్ తెలిపింది. అమెరికా వ్యాప్తంగా ఉన్న తమ 31 కార్యాలయాలు, డెలివరీ కేంద్రాల్లో ఇప్పటికే అత్యధిక సంఖ్యలో స్థానిక ఉద్యోగులు సేవలందిస్తున్నారని వివరించింది. తమ స్థానిక శ్రామిక శక్తిని మరింత బలోపేతం చేయడానికి రాబోయే ఐదేళ్ల కాలంలో అమెరికాలో అదనంగా 15 వేల మంది స్థానిక




అమెరికన్లను ఉద్యోగాల్లోకి తీసుకోనున్నట్లు కంపెనీ పునరుద్ఘాటించింది. ఆ ఒక్క కారణంతోనే గ్రీన్ కార్డు సస్పెండ్ చేసిన అమెరికా.. లబోదిబోమంటున్న భారత ఐటీ ఉద్యోగులు.. గడిచిన రెండేళ్ల కాలంలో తమ దరఖాస్తులు కేవలం ఒంటి అంకె పరిమితికే పరిమితమయ్యాయని.. కాబట్టి ఈ ప్రోగ్రామ్ నిలిపివేత వల్ల తమ వ్యాపార వ్యూహాలపైగానీ, క్లయింట్ సంబంధాలపైగానీ ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని కంపెనీ ధీమా వ్యక్తం చేసింది. అమెరికా కార్మిక శాఖ చేపట్టిన ఈ ఊహించని సస్పెన్షన్ వేటు కేవలం టీసీఎస్‌పైనే కాకుండా కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సిఎల్ క్యాప్‌జెమినిలతో పాటు అమెరికా టెక్ దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్, అడోబ్‌లపై కూడా పడింది. 2009 నుండి ఈ ప్రధాన సంస్థలు విదేశీ ఉద్యోగుల కోసం దాదాపు 30 లక్షల అభ్యర్థనలు దాఖలు చేసి, లక్షకు పైగా ఆమోదాలు పొందినట్లు యూఎస్ రక్షణ వర్గాలు తెలిపాయి. దీనివల్ల స్థానిక అమెరికన్లకు ఉద్యోగాలు దక్కకుండా పోయాయన్నది ట్రంప్ పరిపాలన వర్గం ఆరోపణ. ఈ పరిణామంపై పరిశ్రమ వర్గాలు, ఇతర ఐటీ కంపెనీలు అంతర్గతంగా తమ విదేశీ ఉద్యోగుల పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్ వంటి ఇతర భారతీయ సంబంధిత సంస్థలు కూడా అమెరికాలోని తమ క్లయింట్ ప్రాజెక్టులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ రిక్రూట్‌మెంట్ విధానాలపై దృష్టి సారిస్తున్నాయి. అయితే, గ్రీన్ కార్డ్ కోసం వేచి చూస్తున్న వేలాది మంది భారతీయ ఉద్యోగుల్లో ఈ ఆంక్షలు తీవ్ర ఆందోళన నింపాయి. ముఖ్యం వీసా 6 ఏళ్ల కాలపరిమితి ముగింపు దశకు చేరుకుంటున్న ఉద్యోగులు ౹్రాజు=వీ దాఖలు చేయలేకపోతే దేశం విడిచి వెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తవచ్చు. నావికా దిగ్బంధనాలు, వీసా ఆంక్షలు వంటి కఠిన చర్యల మధ్య భారత ఐటీ కంపెనీలు స్థానిక నియామకాలను విస్తరించడమే ఏకైక మార్గంగా ఎంచుకుంటున్నాయి.

# ఆ ఒక్క కారణంతోనే గ్రీన్ కార్డు సస్పెండ్ చేసిన అమెరికా

### లబోదిబోమంటున్న భారత ఐటీ ఉద్యోగులు..

అమెరికాలోని భారతీయ ఐటీ నిపుణులకు, దిగ్గజ ఐటీ సంస్థలకు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కోలుకోలేని విధంగా షాకిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. వీసా ఉద్యోగులకు శాశ్వత నివాస హోదా అయిన గ్రీన్ కార్డ్ ఇప్పించే ప్రాసెస్ లో అత్యంత కీలకమైన 'శాశ్వత కార్మిక ధృవీకరణ' కార్యక్రమం నుండి భారతదేశపు అగ్రగామి ఐటీ సంస్థలతో పాటు కొన్ని అమెరికన్ దిగ్గజ సంస్థలను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 8, 2026 గురువారం నాడు వైట్ హౌస్ ప్రాంగణంలో ఐసెన్‌హోవర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీస్ బిల్డింగ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ సమక్షంలో కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సోండర్లింగ్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఈ నిషేధం పరిధిలోకి ప్రముఖ ఐటీ సేవలు, అవుట్‌సోర్సింగ్ సంస్థలైన టీసీఎస్ ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సిఎల్ కాగ్నిజెంట్, క్యాప్‌జెమినిలతో పాటు గ్లోబల్ టెక్ దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్, అడోబ్‌లు కూడా వచ్చాయి. ఈ




కంపెనీల నుండి ఇకపై ఎలాంటి కొత్త లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తులను స్వీకరించబోమని.. అలాగే ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను కూడా నిలిపివేస్తున్నామని అధికారులు తేల్చిచెప్పారు. 2009 నుండి కేవలం ఈ కంపెనీలే దాదాపు 30 లక్షల మంది విదేశీ కార్మికుల కోసం అభ్యర్థించాయని.. అందులో 2,30,000 పైగా -1డీ వీసాలు, 1,00,000 కంటే ఎక్కువ లేబర్ సర్టిఫికేషన్లను పొందాయని వెల్లడించారు. మోసపూరిత దరఖాస్తులు, వేతనాల తగ్గింపు, అమెరికన్ కార్మికుల ఉపాధి అవకాశాలను దెబ్బతీయడమే ఈ చర్యకు కారణమని స్పష్టం చేశారు. అమెరికా ప్రభుత్వ తాజా నిర్ణయం భారతీయ ఐటీ ఉద్యోగులపై అత్యంత తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపనుంది. సాధారణంగా ఒక విదేశీ ఉద్యోగికి ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డ్ ప్రక్రియ ప్రారంభించాలంటే సర్టిఫికేషన్ తప్పనిసరి. అమెరికా వెళ్లాలంటే ఏడాది ముందు వీసా కోసం అప్లై చేసుకోవాల్సిందే.. కారణం ఏంటంటే.. ఈ లేబర్ సర్టిఫికేషన్ పొందిన తేదీయే ఉద్యోగి యొక్క "ప్రాధాన్యత తేదీ" గా నిర్ణయించబడుతుంది. సస్పెన్షన్ కారణంగా ప్రభావిత కంపెనీల ఉద్యోగులు కొత్తగా ఫైలింగ్ చేసుకునే అవకాశం లేకపోవడంతో.. వారి గ్రీన్ కార్డ్ ప్రక్రియ నిలిచిపోయి అనంతమైన ఆలస్యం జరగనుంది. ఇప్పటికే సెప్టెంబర్ 2026 వీసా బులెటిన్ ప్రకారం భారతీయులకు -2 కేటగిరీ లభ్యతలో లేకపోగా, -3 ప్రాధాన్యత తేదీ జనవరి 1, 2014గానే ఉంది. మరోవైపు 1డీ వీసాపై గరిష్టంగా ఆరు సంవత్సరాల గడువును చేరుకుంటున్న ఐటీ ఉద్యోగుల పరిస్థితి అత్యంత గందరగోళంగా మారింది.

## 249 పరుగులూ సరిపోలేదా భారత బౌలర్లకు గవాస్కర్ కీలక ప్రశ్నలు!



వెస్టిండీస్‌తో రెండో టీ20లో భారత్ భారీ స్కోరు చేసినా ఓటమి తప్పలేదు. 250 పరుగుల లక్ష్యాన్ని కరీబియన్ జట్టు మరో 9 బంతులు మిగిలుండగానే ఛేదించింది. దీంతో భారత బౌలర్ల ప్రదర్శనపై విమర్శలు మొదలయ్యాయి. దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ కూడా బౌలర్ల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇంత భారీ స్కోరును కాపాడుకోలేకపోవడానికి కారణమేంటని ప్రశ్నించాడు.భారత్ బ్యాటర్లు తమ పని సమర్థంగా చేశారని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో భారత జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. తొలుత సంజు శాంసన్ కీలక ఇన్నింగ్స్‌తో జట్టుకు భారీ స్కోరు అందించాడు. అయితే బౌలర్లు మాత్రం ఆ ప్రదర్శనకు తగిన న్యాయం చేయలేకపోయాడు."రెండు ఓవర్లు నెమ్మదిగా సాగిన తర్వాత భారత్ 235-240 పరుగులు చేస్తుందని అనుకున్నా. కానీ మరో 9 పరుగులు ఎక్కువే చేసింది. కాబట్టి బ్యాటర్లను తప్పుపట్టలేం. బౌలర్లు మాత్రం తమ స్థాయికి తగ్గట్లు బౌలింగ్ చేయలేదు. బౌలింగ్ కోచ్ ఏం ఆశించాడు బౌలర్లు దానికి తగ్గట్లు బౌలింగ్ చేశారా అన్నది ఆసక్తికరంగా ఉంటుంది" అని గవాస్కర్ వ్యాఖ్యానించారు.మరోవైపు మాజీ పేసర్ వరుణ్ ఆరోన్ కూడా భారత బౌలర్ల వ్యూహాన్ని తప్పుబట్టాడు. తొలి ఓవర్లోనే వెస్టిండీస్ రెండు వికెట్లు కోల్పోయిన తర్వాత కూడా పేసర్లతోనే ఒత్తిడి కొనసాగించాల్సిందని అన్నాడు. పవర్‌ప్లేలో నాలుగో ఓవర్‌ను అక్షర్ పటేల్‌తో వేయించడం అనవసరమని అభిప్రాయపడ్డాడు. ఆ ఓవర్లో అక్షర్ 16 పరుగులు ఇచ్చాడు. షాయ్ హోప్, రొవ్‌మన్ పావెల్ కొత్త బంతిని ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతున్నప్పుడు పేసర్లతోనే నాలుగు ఓవర్లు వేయించాల్సిందని పేర్కొన్నారు.మ్యాచ్ ఓటమిపై భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ స్పందిస్తూ.. మంచు ప్రభావం కారణంగా ఎంత స్కోరు చేస్తే సరిపోతుందో అంచనా వేయడం కష్టమని చెప్పాడు. 249 పరుగుల లక్ష్యాన్నే వెస్టిండీస్ సులువుగా ఛేదించిందని గుర్తు చేశాడు. ఆ జట్టు కెప్టెన్ షాయ్ హోప్ 45 బంతుల్లోనే శతకం బాదగా, షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ 37 బంతుల్లో 84 పరుగులతో చెలరేగాడు. దీంతో వెస్టిండీస్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

## రూథర్‌ఫోర్డ్ విధ్వంసకర బ్యాటింగే మా గెలుపునకు కారణం: షాయ్ హోప్



భారత్‌తో జరిగిన రెండో టీ20లో చారిత్రక విజయం సాధించడంపై వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ స్పందించాడు. కీలక భాగస్వామ్యాలు, ముఖ్యంగా షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్ వల్లే ఈ గెలుపు సాధ్యమైందని ప్రశంసించాడు. రాంచీ వేదికగా శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 250 పరుగుల భారీ లక్ష్యాన్ని వెస్టిండీస్ మరో రెండు ఓవర్లు మిగిలి ఉండగానే కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇది టీ20 క్రికెట్ చరిత్రలోనే రెండో అత్యధిక విజయవంతమైన ఛేదనగా రికార్డు సృష్టించింది.ఈ మ్యాచ్‌లో కెప్టెన్ హోప్ 45 బంతుల్లోనే అద్భుత శతకం సాధించగా, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ కేవలం 37 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సర్లతో 84 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఛేదనలో ఒక దశలో 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును వీరిద్దరూ కలిసి గెలుపు తీరాలకు చేర్చారు.మ్యాచ్ అనంతరం ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన హోప్ మాట్లాడుతూ.. "భారత్‌లో ఛేజింగ్ ఎప్పుడూ సవాలే. కానీ ఇక్కడ ఎంత పెద్ద స్కోరైనా ఛేదించగలమనే నమ్మకం ఉంటుంది. 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోయినప్పుడు ఒత్తిడి పెరిగింది" అని అంగీకరించాడు. "రోవ్‌మన్ పావెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాను. ఆ తర్వాత వచ్చిన రూథర్‌ఫోర్డ్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో మ్యాచ్ గతిని మార్చేశాడు. మా గెలుపునకు అవసరమైన స్పార్క్ అతడే ఇచ్చాడు" అని వివరించాడు.కొన్నిసార్లు భాగస్వామి అద్భుతంగా ఆడుతున్నప్పుడు మనం ప్రశాంతంగా ఉండి అతడి ఆటను ఆస్వాదించాలని హోప్ అన్నాడు. "రూథర్‌ఫోర్డ్ అద్భుతంగా ఆడుతున్నప్పుడు నేను అనవసర రిస్క్ తీసుకోవాల్సిన అవసరం రాలేదు. మేం సరైన రన్‌రేట్‌తో వెళు ్తన్నామని భావించాను" అని తెలిపాడు. బౌలింగ్‌లో రాస్టన్ ఛేజ్ (3/24) ప్రదర్శనను హోప్ ప్రత్యేకంగా కొనియాడాడు. బ్యాటింగ్ పిచ్‌పై ఛేజ్ అద్భుతంగా బౌలింగ్ చేసి తమను మ్యాచ్‌లో నిలబెట్టాడని చెప్పాడు.తన ఫామ్ గురించి మాట్లాడుతూ.. సన్నద్ధత, మానసిక దృఢత్వమే తన ప్రదర్శనకు కారణమని, ఈ ఫామ్ ఇలాగే కొనసాగాలని ఆశిస్తున్నానని పేర్కొన్నాడు. ఈ విజయంతో విండీస్ సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఛేదన ఆరంభంలో భారత బౌలర్ మయాంక్ యాదవ్ మూడు వికెట్లతో చెలరేగినా, విండీస్ అద్భుతంగా పుంజుకుని చారిత్రక విజయాన్ని నమోదు చేసింది.

## మంచు దెబ్బకు 249 పరుగులు కూడా సరిపోలేదు.. ఓటమిపై శ్రేయస్ అయ్యర్



మంచు ప్రభావం తీవ్రంగా ఉన్నప్పుడు ఎంత భారీ స్కోరు చేసినా సరిపోదని, కచ్చితమైన లక్ష్యాన్ని నిర్దేశించడం అసాధ్యమని టీమిం డియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అభిప్రాయపడ్డాడు. వెస్టిండీస్‌తో శుక్రవారం రాత్రి జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత్ నిర్దేశించిన 250 పరుగుల భారీ లక్ష్యాన్ని విండీస్ అలవోకగా ఛేదించిన అనంతరం అయ్యర్ మాట్లాడాడు. మంచు కారణంగా బౌలర్లకు పట్టుచిక్కలేదని, దీనిని సద్వినియోగం చేసుకున్న విండీస్ బ్యాటర్లు అద్భుతంగా ఆడారని ప్రశంసించాడు.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. సంజూ శాంసన్ (41 బంతుల్లో 82), తిలక్ వర్మ (18 బంతుల్లో 44 నాటౌట్), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (18 బంతుల్లో 40) మెరుపులతో 20 ఓవర్లలో 5 వికెట్లకు 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే, ఈ కొండంత లక్ష్యాన్ని వెస్టిండీస్ మరో రెండు ఓవర్లు మిగిలి ఉండగానే కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇది పురుషుల టీ20 క్రికెట్ చరిత్రలోనే రెండో అత్యధిక విజయవంతమైన ఛేదనగా రికార్డు సృష్టించింది.విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ (45 బంతుల్లో 100), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (37 బంతుల్లో 84) విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను పూర్తిగా తమవైపు తిప్పుకున్నారు.ఓటమిపై అయ్యర్ స్పందిస్తూ "నిజం చెప్పాలంటే, మంచు ప్రభావం ఉన్నప్పుడు ఇంత స్కోరు చేస్తే సరిపోతుందని కచ్చితంగా చెప్పలేం. 249 పరుగులను కూడా రెండు ఓవర్లు మిగిలి ఉండగానే ఛేదించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మా బౌలర్లు కాస్త తడబడినప్పటికీ, విండీస్ బ్యాటర్లు అసాధారణంగా ఆడారు. వారిని అభినందించాల్సిందే" అని అన్నాడు.అంతకుముందు, భారత బౌలర్ మయాంక్ యాదవ్ పవర్‌ప్లేలో కమిల్ పూరన్, హెట్‌మైర్, రోవ్‌మన్ పావెల్ వికెట్లు పడగొట్టి శుభారంభం అందించినప్పటికీ, హోప్-రూథర్‌ఫర్డ్ భాగస్వామ్యం ముందు అది తేలిపోయింది. అయ్యర్ మాట్లాడుతూ సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, మయాంక్ యాదవ్‌ల ప్రదర్శనను ప్రశంసించాడు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను వెస్టిండీస్ 1-1తో సమం చేసింది.

# ఏడాదిగా సోషల్ మీడియాకు దూరంగా ఐశ్వర్య లక్ష్మి

## వాటితో విసిగిపోయానంటూ కామెంట్..!

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ఐశ్వర్య లక్ష్మి గత ఏడాది కాలంగా సోషల్ మీడియాకు దూరంగా ఉంటున్నారు. సాధారణంగా సినీ తారలు తమ సినిమాల ప్రచారం, వ్యక్తిగత విషయాలు, అభిమానులతో అనుసంధానం కోసం సామాజిక మాధ్యమాలను విస్తృతంగా ఉపయోగిస్తుంటారు. అయితే ఐశ్వర్య లక్ష్మి మాత్రం అందుకు భిన్నంగా సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. తాజాగా తన నిర్ణయం వెనుక ఉన్న కారణాలను ఆమె వెల్లడించారు.సోషల్ మీడియాను పూర్తిగా వదిలేస్తానని తాను ఎప్పుడూ ఊహించలేదని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. మొదట కొంతకాలం మాత్రమే సామాజిక మాధ్యమాలకు విరామం తీసుకుని, ఆ తర్వాత మళ్లీ తిరిగి రావాలని భావించానని చెప్పారు. అయితే కాలం గడిచే కొద్దీ సోషల్ మీడియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనించిన తర్వాత తిరిగి రావాలనే ఆలోచనను విరమించుకున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఏఐ ఆధారిత కంటెంట్ విపరీతంగా పెరగడం, దాన్ని ఉపయోగించి కొందరు చేస్తున్న అసభ్యకరమైన ఎడిటింగ్ తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టిందని ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికల్లో ఇలాంటి కంటెంట్ పెరుగుతుండటం తనకు నచ్చలేదని, చివరకు మానసిక ప్రశాంతత కోసం పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో ఉన్న సమయంలో కామెంట్లు, పర్సనల్ మెసేజెస్ తాను చదివేదాన్నని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. అయితే వాటిని పదేపదే చదవడం వల్ల తనపై ప్రతికూల ప్రభావం పడేదని చెప్పారు. కొన్నిసార్లు ప్రపంచమంతా తనకు వ్యతిరేకంగా ఉందనే భావన కలిగేదని వెల్లడించారు. ముఖ్యంగా ప్రతికూల వ్యాఖ్యలు మనకు తెలియకుండానే మన ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక దశలో తనను ఎవరూ ఇష్టపడరనే భావన కూడా కలిగిందని తెలిపారు. అందుకే సోషల్ మీడియా నుంచి దూరంగా ఉండటం తనకు ఎంతో ఉపశమనాన్ని ఇచ్చిందని చెప్పారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండటం వల్ల తన జీవితంలో ఎంతో స్వేచ్ఛ లభించినట్లు అనిపిస్తోందని ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు. ప్రస్తుతం తాను చాలా సంతోషంగా ఉన్నానని, సామాజిక మాధ్యమాల్లో ఉండకపోవడం వల్ల తనకు ఎలాంటి అసంతృప్తి లేదని తెలిపారు. తాను మళ్లీ సోషల్ మీడియాలోకి రావాలని తన నిర్వాహకులు సూచించిన విషయాన్ని కూడా ఆమె వెల్లడించారు. సోషల్ మీడియా ఖాతాను తిరిగి ప్రారంభించకపోతే ఆర్థికంగా చాలా నష్టపోతానని వారు చెప్పినట్లు తెలిపారు. అయితే డబ్బు కంటే తనకు లభిస్తున్న మానసిక ప్రశాంతతే ముఖ్యమని వారికి చెప్పినట్లు ఐశ్వర్య లక్ష్మి వెల్లడించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండటంతో బ్రాండ్ ప్రచారాల విషయంలో కూడా కొన్ని అవకాశాలను వదులుకోవాల్సి వస్తుందని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. తాను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయలేనని స్పష్టం చేశారు. అయితే సోషల్ మీడియాలో ప్రచారం చేయకపోయినా ప్రజలు తనను సినిమాల ద్వారానే గుర్తుపెట్టుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.



# ఊరిలో ఒక నక్క ఉండేది.. బాలకృష్ణ వాయిస్‌తో ఫహద్ ఫాసిల్ 'డోన్ట్ ట్రబుల్ ది ట్రబుల్' ట్రైలర్



మాలీవుడ్ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాసిల్ హీరోగా నటిస్తున్న తెలుగు డెబ్యూ ఫిల్మ్ ఐశీతో ఎతీశీబఎశ్రీవ్ ష్ట్ర ఎతీశీబఎశ్రీవ. ఫాంటసీ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రాన్నిబాహుబలి ఫేం ఆర్కా మీడియా వర్క్ తెరకెక్కిస్తుండటంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. శశాంక్ యేలేటి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఊరిలో ఒక నక్క ఉండేది.. దానికి రెండు విషయాలు చాలా బాగ తెలుసు.. ఒకటి డబ్బులు.. రెండోది ట్రబుల్ అంటూ బాలకృష్ణ వాయిస్ ఓవర్‌తో షురూ అయింది ట్రైలర్ ఎక్కడ డబ్బులున్నా అది వాసనతో పసిగట్టేసేది.. ఎక్కడ ట్రబుల్ ఉన్నా అది తప్పించుకుని పారిపోయేది. ఒక రోజు డబ్బులు, ట్రబుల్ ఒకేసారి ఎదురయ్యాయి. నక్కకు డబ్బులు మాత్రమే కనిపించాయి.. కానీ దాని పక్కనే ట్రబుల్ కనిపించలేదు.. అంటూ సాగుతున్న ట్రైలర్ ఫహద్ ఫాసిల్‌తోపాటు సారా పాలేకర్ మధ్య సన్నివేశాలతో కొంచెం ఫన్, కొంచెం సీరియస్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తోంది. ఆర్కా మీడియా వర్క్స్, ఎస్ ఎస్ రాజమౌళి కుమారుడు ఎస్ఎస్ కార్తికేయ గాష్ట్రశీఱఅగ దీబంఱఅవం సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఎస్ఎస్ రాజమౌళి సమర్పిస్తున్న ఈ మూవీకి కాలభైరవ సంగీతం అందిస్తున్నాడు. అక్టోబర్ 2న తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా ఈ మూవీని విడుదల చేస్తున్నారు.



# మరోసారి విజయ్ దేవరకొండ-రష్మిక జోడీ మ్యాజిక్..

## 'రణబాలి' నుంచి 'ఏందయ్యా స్వామి' పాట విడుదల

టాలీవుడ్‌లో ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందిన జోడీల్లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జోడీ ఒకటి. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాల్లో కలిసి నటించిన ఈ జంట మరోసారి 'రణబాలి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి 'ఏందయ్యా స్వామి' అనే పూర్తి పాటను చిత్రబృందం విడుదల చేసింది. 'ఏందయ్యా స్వామి' పాటకు అజయ్--అతుల్ సంగీతం అందించారు. పల్లెటూరి జానపద శైలికి ఆధునిక మెలోడీ స్వరాలను జోడిస్తూ పాటను ప్రత్యేకంగా రూపొందించారు. మొదటిసారి వినగానే శ్రోతలను ఆకట్టుకునేలా సంగీతాన్ని తీర్చిదిద్దారు. పాటలోని సాహిత్యం కూడా గ్రామీణ ప్రేమ, భావోద్వేగాలను ప్రతిబింబించేలా సాగుతుంది. "ఏందయ్యా స్వామి.. ఇంతగా గాస్తాంది.. ఎన్నెలా ఊపేస్తా ఉంది" అంటూ సాగే పదాలు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే పదజాలం, జానపద బాణీ, మెలోడీ కలయిక పాటకు ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తున్నాయి. ఈ పాటలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గతంలో 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' సినిమాల్లో ఈ జోడీకి వచ్చిన ఆదరణ నేపథ్యంలో.. 'రణబాలి'లో వీరిద్దరినీ కలిసి చూడటంపై అభిమానుల్లో మొదటి నుంచే ఆసక్తి ఉంది. తాజాగా విడుదలైన పాటలో వీరిద్దరి మధ్య కనిపించే ప్రేమ, భావోద్వేగాలు, సహజమైన హావభావాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పాత్రలకు తగ్గట్టుగా విజయ్, రష్మిక కనిపిస్తున్న తీరు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. పాటలోని దృశ్యాల్లో పల్లెటూరి వాతావరణాన్ని సహజంగా చూపించే ప్రయత్నం కనిపిస్తోంది. పాత్రల దుస్తులు, పరిసరాలు, విజువల్స్ అన్నీ కథ జరిగే ప్రాంతానికి తగ్గట్టుగా ఉండటంతో పాటకు మరింత సహజత్వం వచ్చింది. 'ఏందయ్యా స్వామి' పాట విడుదలైన వెంటనే ప్రేక్షకుల నుంచి స్పందన మొదలైంది. ముఖ్యంగా పాటలోని జానపద శైలి, సంగీత కూర్పు, సాహిత్యం గురించి అభిమానులు చర్చించుకుంటున్నారు. విజయ్ దేవరకొండ--రష్మిక జోడీని మరోసారి తెరపై చూడబోతుండటంతో వారి అభిమానుల్లోనూ ఈ పాటపై ఆసక్తి కనిపిస్తోంది. గాయకుల ఆలాపన, సాహిత్యానికి అనుగుణంగా రూపొందించిన దృశ్యాలు పాటకు ప్రత్యేకమైన వాతావరణాన్ని తీసుకొచ్చాయి.

# పుష్పలో ఆ రోల్ నేనే చేయాల్సింది: శివాజీ ఆసక్తికర కామెంట్స్



టాలీవుడ్ నటుడు శివాజీ ఆసక్తికర కామెంట్స్ చేశారు. అల్లు అర్జున్ హీరోగా వచ్చిన పుష్ప మూవీ గురించి ఆయన మాట్లాడారు. కోర్టు మూవీ హీరో నటించిన తెల్లకాగితం ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌కు హాజరైన ఆయన పుష్ప సినిమా గురించి కామెంట్స్ చేశారు. ఆ మూవీలో కీలక పాత్రపై ఓ ఇంట్రెస్టింగ్ విషయాన్ని పంచుకున్నారు. సినిమా ఇండస్ట్రీలో ఎవరికి ఏ పాత్ర రాసిపెట్టి ఉంటే వాళ్లకే దక్కుతుందన్నారు. పుష్ప చిత్రంలో సునీల్ పోషించిన రోల్ మొదట తనకే వచ్చిందని శివాజీ వెల్లడించారు. మంగళ శీను పాత్ర నేను చేయాల్సిందని తెలిపారు. కానీ మనం ఎంత అనుకున్నా.. విధి ఒకటి రాసి పెట్టి ఉంటుందని శివాజీ అన్నారు.  అది సునీల్ ఖాతాలోకి వెళ్లాలని రాసిపెట్టి ఉందన్నారు. అందుకే సునీల్ మంగళం శీనుగా మిమ్మల్ని అలరించాడని తెలిపారు. ఆ క్యారెక్టర్‌లో సునీల్ అద్భుతంగా నటించారని కొనియాడారు. అలా మంగళం శ్రీను పాత్ర వెనుక ఉన్న అసలు నిజాన్ని రివీల్ చేశారు. ఈ సందర్భంగా తెల్ల కాగితం సినిమాతో తనకున్న అనుబంధాన్ని శివాజీ గుర్తుచేసుకున్నారు. రాజమండ్రి నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ తన వద్దకు వచ్చిందన్నారు. ఈ కథ వినగానే విపరీతంగా నచ్చడంతో తానే స్వయంగా నిర్మించాలని కూడా భావించినట్లు చెప్పారు. ఒక చిన్న టౌన్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ ఎమోషనల్ లవ్ స్టోరీ ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ మూవీ హీరో హర్ష్ రోషన్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవాలని కోరుకుంటున్నట్లు శివాజీ తెలిపారు.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THIRUMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040